Follow: @ANNTELUGU

04-10-2025

ANN తెలుగు

# మహా పత్రిక

శనివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 299 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## సొంతూళ్లో సీఎం రేవంత్ దసరా

### కొండారెడ్డిపల్లి ప్రజలతో కలిసి సంబురం

### కొడంగల్ ప్రజలతో ఆత్మీయ కలయిక

**నాగర్ కర్నూలు, మహా:** దసరా ఉత్సవాలను సీఎం రేవంత్ రెడ్డి తన స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. నాగర్ కర్నూలు జిల్లా వంగూర్ మండలం కొండారెడ్డిపల్లికి హెలికాప్టర్‌లో కుటుంబసభ్యులతో కలిసి ఆయన చేరుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతోపాటు గ్రామస్తులు గజమాలతో స్వాగతం పలికి.. ఆయనపై పూల వర్షం కురిపించారు. అనంతరం ఆ గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామివారిని దర్శించుకుని సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆ తర్వాత తన నివాసానికి రేవంత్ రెడ్డి చేరుకున్నారు. సాయంత్రం గ్రామంలోని దసరా ఉత్సవాల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. స్థానిక కట్టమైసమ్మ దేవాలయంలో ఆయన పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులతో కలిసి జమ్మిచెట్టు వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. మరోవైపు స్వగ్రామంలో దసరా ఉత్సవాల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొంటున్నారని సమాచారం అందడంతో .. ఆ పరిసర గ్రామాల ప్రజలంతా కొండారెడ్డిపల్లెకు భారీగా తరలివచ్చారు. దీంతో ఆ గ్రామం జనసంద్రంగా మారింది. ఆ తర్వాత తన నియోకవర్గం కొడంగల్ ప్రజలతో కూడా ఆత్మీయంగా గడిపారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు కొడంగల్ లోనే ఉన్నారు.

**టాప్ న్యూస్**

### లోకల్ బాడీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి వెళ్తాం



- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

02

### తేడా జరిగితే మ్యాప్ నుంచి లేపేస్తాం



- పాకిస్థాన్ కు ఆర్మీ చీఫ్ వార్నింగ్..
- ఆపరేషన్ సింధూర్ ఈ సారి వేరే లెవెల్

02

### త్రిషకు బాంబు బెదిరింపు



- సీఎం స్టాలిన్ ఇంటికి కూడా...

08

SRI GOLD
TRUSTED GOLD BUYERS

**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,18,530 |
| 22 క్యారెట్ | 1,08,650 |
| సిల్వర్ (కేజీ) | 1,51,000 |

# దేశ రక్షణ విషయంలో.. రాజీపడే ప్రసక్తే లేదు

## మతం అడగలే..ఉగ్రవాదులనే టార్గెట్ చేశాం

### జీటో కనెక్ట్‌లో కేంద్రమంత్రి రాజ్ నాథ్ సింగ్ సంచలన వ్యాఖ్యలు

### ఫ్యాక్టరీ ఆఫ్ ది వరల్డ్ గా భారత్

### త్వరలో మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్



**హైదరాబాద్, మహా :** దేశ గౌరవం, సమగ్రత విషయంలో తామెప్పుడూ రాజీ పడలేదని... పహల్గాం ఉగ్రదాడికి ప్రతిస్పందనగా దాడులు చేసినప్పుడు ఉగ్రవాదుల మతం ఏమిటో తాము అడగలేదని... ఉగ్రవాదులను మాత్రమే టార్గెట్ చేశామని.. సాధారణ ప్రజలను, సైనిక స్థావరాలను కాదని కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన జీటో కనెక్ట్ 2025 కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. 2016 సర్జికల్ స్ట్రైక్స్, 2019 బాలాకోట్ ఎయిర్‌స్ట్రైక్స్, 2025లో ఆపరేషన్ సిందూర్ సమయంలోనైనా మరెప్పుడైనా ఇదే విధానంలో మన విధానం ఉంటుందన్నారు. భారతదేశం తన సైనిక, ఆర్థిక శక్తిని పెంచుకోవడం ఇతరులపై ఆధిపత్యం చెలాయించడానికి కాదని.. దేశ సాంస్కృతిక విలువలు, ఆధ్యాత్మిక సంప్రదాయాలు, మహావీరుడు బోధించిన మానవీయ ఆదర్శాలను కాపాడుకోవడానికేనని రక్షణ మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో శనివారం జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జీఐటీఓ) నిర్వహించిన

మిగతా 2లో

### విలువలతో కూడిన వృద్ధికి కేరాఫ్ తెలంగాణ

- పారిశ్రామికాభివృద్ధికి అనుకూలం, అవకాశాల ఖని
- పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఆహ్వానం
- జీటో కనెక్ట్ 2025 ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

02



## అదిరింది.. దత్తన్న

### ఆత్మీయతకు ప్రతీక అలాయ్ బలాయ్

### ప్రముఖ నటులు నాగార్జున ప్రశంసలు

రాజకీయాలకు అతీతంగా నిర్వహించడం అభినందనీయం

రామాయణ కాలం నాటి నుండీ అలయ్..బలాయ్ బ్రహ్మానందం ప్రశంసలు

హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్రమంత్రులు, రాష్ట్ర మంత్రులు, కల్వకుంట్ల కవిత

ఆపరేషన్ సింధూర్ థీమ్ తో నిర్వహణ

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో మాజీ కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ ఆధ్వర్యంలో నిర్వహించిన 'అలయ్ బలయ్' కార్యక్రమం ఘనంగా జరిగింది. దత్తాత్రేయ 2005లో ప్రారంభించిన ఈ కార్యక్రమం ప్రతి ఏటా దసరా పండుగ తర్వాత రోజున నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది 'అలయ్ బలయ్' కార్యక్రమాన్ని ప్రత్యేకంగా 'ఆపరేషన్ సింధూర్' థీమ్‌తో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. వారిలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, కేంద్ర మంత్రి అర్జున్ సింగ్ మేధావాల్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు, రిటైర్డ్ సీజేఐ ఎన్వీ రమణ, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీలు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, డాక్టర్ లక్ష్మణ్, రఘునందన్ రావు, సినీ ప్రముఖులు నాగార్జున, బ్రహ్మానందం, సుద్దాల అశోక్ తేజ ఉన్నారు.

మిగతా 2లో



### విజయ్ దేవరకొండ- రష్మిక ఎంగేజ్ మెంట్

#### ఫిబ్రవరిలో పెళ్ళి

**హైదరాబాద్, మహా :** టాలీవుడ్ నటులు.. లవ్ బర్డ్స్ విజయ్ దేవరకొండ, రష్మిక ఎంగేజ్ మెంట్ చేసుకున్నారు. విజయ్ ఇంట్లోనే నిశ్చితార్థం జరిగింది. శుక్రవారం మధ్యాహ్నం 11.15 నిమిషాలకు ఎంగేజ్మెంట్ ఇరు కుటుంబ సభ్యుల సమక్షంలో జరిగింది. ఎంగేజ్ మెంట్ కొంతమంది కుటుంబసభ్యుల సమక్షంలో వీరు ఎంగేజ్ మెంట్ చేసుకున్నారు. ఇక వచ్చే ఏడాది ఫిబ్రవరిలో వీరు పెళ్లి చేసుకుంటారని సమాచారం. కొన్నేళ్లుగా విజయ్, రష్మిక ప్రేమలో ఉన్నారు.

**స్టాక్ మార్కెట్**

| | |
|---|---|
| సెన్సెక్స్ ↗ | 81,207.17 |
| నిఫ్టీ ↗ | 24,894.25 |

**ఈరోజు గుడ్ల ధరలు**

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్ల ధర | 5 | 150 |
| హోల్ సేల్ గుడ్ల ధర | 5 | 150 |
| రిటైల్ గుడ్ల ధర | 5.3 | 159 |

## అడ్వాన్స్ కంగ్రాచ్యులేషన్స్..

### లోకల్ బాడీ ఎన్నికల్లో విజయం మనదే...

### పార్టీని వ్యతిరేకిస్తే కన్నతల్లిని అవమానించినట్లే

### కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు



**కరీంనగర్, మహా:** స్థానిక సంస్థల ఎన్నికల వేళ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం సాయంత్రం కరీంనగర్‌లోని ఈఎన్ గార్డెన్స్‌లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధి నేతలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడారు. 'అడ్వాన్స్ కంగ్రాచ్యులేషన్స్.. లోకల్ బాడీ ఎన్నికల తరువాత ఇక్కడున్న వారిలో చాలా మంది ఎంపీటీసీలు, జడ్పీటీసీలుగా గెలవబోతున్నారు. ఈసారి కరీంనగర్, సిరిసిల్ల జిల్లా పరిషత్ చైర్మన్ పీఠాలను బీజేపీ కైవసం చేసుకోబోతోంది. సర్వే నివేదికలన్నీ ఇదే విషయం తేటతెల్లం చేస్తున్నాయి.' అని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ఎప్పుడెప్పుడు ఓడిద్దామా? అని ప్రజలు ఎదురు చూస్తున్నారని, తాను సైతం ఎన్నికలు ఎప్పుడెప్పుడు జరుగుతాయా అని ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. తాజా మాజీ సర్పంచులు, రైతులు, మహిళలు, వృద్ధులు, నిరుద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగులే ఈసారి కాంగ్రెస్‌ను ఓడించబోతున్నారని, బీజేపీకి వాళ్లే బ్రాండ్ అంబాసిడర్లు కాబోతున్నారని చెప్పారు.

**సర్వే నివేదికలను బట్టి టిక్కెట్లు..**

అభ్యర్థులకు టిక్కెట్ల కేటాయింపు విషయాన్ని బీజేపీ రాష్ట్ర నాయకత్వం చూసుకుంటుందని,

మిగతా 2లో

## ప్రశాంత్ కిషోర్ సంచలన వ్యాఖ్యలు

### తెలంగాణ వచ్చి మరీ రేవంత్ రెడ్డిని ఓడిస్తా..

బీహార్ గడ్డపై అడుగు పెడితే రేవంత్ ను తరిమి కొడతా

మోదీ, రాహుల్ గాంధీ కూడా రేవంత్‌ను కాపాడలేరు



**పాట్నా, మహా :** బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో పార్టీలన్ని ప్రచార కార్యక్రమాలతో బిజీగా ఉన్నాయి. ఈసారి అస్లెంబ్లీ ఎన్నికల్లో ప్రశాంత్ కిషోర్ కూడా పోటీ చేస్తున్నారు. జన సూరజ్ పార్టీ స్థాపించిన ఆయన ఎన్నికల బరిలోకి దిగారు. బిహార్ ఎన్నికల ప్రచార కార్యక్రమాలతో బిజీగా ఉన్న ప్రశాంత్ కిషోర్ తెలంగాణ ముఖ్యమంత్రి

మిగతా 2లో

### మధ్యప్రదేశ్‌లో టమాటా వైరస్ కలకలం

చిన్నారుల్లో ఎక్కువ కేసులు

మధ్యప్రదేశ్‌ను వణికిస్తున్న వైరస్

వివరాలు 2లో

manepally® Jewellers Pvt. Ltd.
trusted legacy since 1890
Anniversary & Festive Special Offers
On Gold Jewellery 3% V.A Onwards
Diamond ₹49,950/- Per Ct
EF/VVS/INTERNATIONAL CERTIFIED

# దేశ రక్షణ విషయంలో.. రాజీపడే ప్రసక్తే లేదు



(మొదటిపేజీ తరువాయి)

జీటో కనెక్ట్ కార్యక్రమం ప్రారంభ సెషన్ లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రక్షణ ఎగుమతులు 2014లో రూ. 600 కోట్లుగా ఉండగా, ప్రస్తుతం రూ. 24,000 కోట్లకు పెరిగాయని తెలిపారు. 2029 నాటికి ఈ ఎగుమతులు రూ. 50,000 కోట్లకు చేరుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. తేజస్ యుద్ధ విమానాలు, ఆకాశ్ క్షిపణులు, అర్జున్ ట్యాంకులు, ప్రచండ్ హెలికాప్టర్లు స్వదేశీ సాంకేతికతతో తయారవుతున్నాయని వివరించారు. భారత్ ఇక తన రక్షణ అవసరాలు మాత్రమే తీర్చుకోవడం కాదు... ప్రపంచంలో ఉద్భవిస్తున్న ఆయుధ సరఫరాదారుగా గుర్తింపు పొందుతోందన్నారు. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ నుంచి 97 లైట్ కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల కొనుగోలు ఒప్పందం కుదుర్చుకున్నామని, వాటిలో 64శాతం పైగా స్వదేశీ పరిజ్ఞానం ఉపయోగించినట్లు వివరించారు.

**ఫ్యాక్టరీ ఆఫ్ ది వరల్డ్ గా భారత్**

'ఈరోజు భారత్ బొమ్మల నుంచి ట్యాంకుల వరకు అన్నీ తయారు చేస్తోంది. వేగంగా ప్రపంచ మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా ఎదుగుతున్నాం. ఆ రోజు దూరంలో లేదు, భారత్ 'ఫ్యాక్టరీ ఆఫ్ ది వరల్డ్'గా నిలుస్తుంది. వోకల్ ఫర్ లోకల్' నుంచి ఇప్పుడు లోకల్ టు గ్లోబల్‌పై దృష్టి సారించాం. మేక్ ఇన్ ఇండియా వంటి కార్యక్రమాలు స్థానిక వ్యాపారాలను బలోపేతం చేయడంతో పాటు, భారత ఉత్పత్తులకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చాయి' అని కేంద్ర మంత్రి అన్నారు. ప్రస్తుతం భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందని పేర్కొన్నారు. 2030 నాటికి జీడీపీ 7.3 ట్రిలియన్ డాలర్లను దాటి మూడో స్థానంలోకి వస్తుందని తెలిపారు. ఐఎంఎఫ్ అంచనాల ప్రకారం 2038 నాటికి కొనుగోలు శక్తి సమానత (పీపీపీ) ప్రాతిపదికన భారత్ ప్రపంచంలో రెండవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదుగుతుందని అన్నారు. సామాజికంగా, ఆర్థికంగా మనం అసాధారణ విజయాలు సాధించామని... పౌరుల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ దృఢ సంకల్ప నాయకత్వం వల్ల భారత్ మూడవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదుగుతోందని పేర్కొన్నారు.

**2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశం**

'భారత జనాభాలో 0.5 శాతం కన్నా తక్కువే ఉన్నప్పటికీ, దేశ పన్ను వసూళ్లలో జైన్స్ సహకారం 24శాతం వరకూ ఉంది. జైనిజం భారతీయ సాంస్కృతిక, ఆధ్యాత్మిక వారసత్వాన్ని బలోపేతం చేస్తూ, ఆర్థిక పురోగతికి మార్గం సుగమం చేస్తోంది' అని రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. డా.విక్రమ్ సారాభాయి, డా.డి.ఎస్. కోఠారి, డా.జగదీశ్ చంద్ర జైన్, డా.మీనాక్షి జైన్ వంటి మహనీయులను ఆయన గుర్తుచేసుకున్నారు. విదేశాలనుంచి దొంగిలించబడిన 20కిపైగా జైన తీర్థంకర విగ్రహాలను తిరిగి తెప్పించడం, జైన్ గ్రంథాల్లో ఉపయోగించే ప్రాకృత భాషను 'క్లాసికల్ లాంగ్వేజ్ ఆఫ్ ఇండియా'గా గుర్తించడం వంటి ప్రభుత్వ కృషిని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. మహావీరుడు బోధించిన అహింస, సత్యం, అపరిగ్రహం వంటి విలువలు భారత్ అభివృద్ధి దిశలో మార్గదర్శకాలుగా నిలుస్తాయన్నారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారడంలో ఈ ఆధ్యాత్మిక సూత్రాలు పునాది అవుతాయని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

# అదిరింది.. దత్తన్న

(మొదటిపేజీ తరువాయి)

ఈ వేదికపై మేజర్ జనరల్ అజయ్ మిశ్రాను సన్మానించారు. ఈ సందర్భంగా మేజర్ జనరల్ అజయ్ మిశ్రా మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులకు తగిన సమాధానమని, ఈ ఆపరేషన్ కేవలం 28 గంటల్లోనే పూర్తయిందని తెలిపారు. ప్రధానమంత్రి మోడీ 'టెర్రరిజంతో చర్చలు ఉండవు' అనే సందేశాన్ని స్పష్టం చేశారని పేర్కొన్నారు. అనంతరం హీరో నాగార్జునను సన్మానించగా, ఆయన మాట్లాడుతూ.. ఇది చాలా కొత్తగా ఉంది. ఇరవై ఏళ్లుగా అలయ్ బలయ్‌ని నిర్వహిస్తున్నారు. ఇది రాజకీయాలకు అతీతంగా నడుస్తుంది. ఇలా అందరూ ఒకే వేదిక మీదకు రావడం మాకు కాన్ఫిడెన్స్‌ను ఇస్తుందని పేర్కొన్నారు. అలాగే హాస్యనటుడు బ్రహ్మానందంను కూడా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రేమను పంచుకునే కార్యక్రమం అలయ్ బలయ్. అందరినీ ఒకచోట చేర్చి నిర్వహిస్తున్న దత్తాత్రేయకి అభినందనలు అని అన్నారు.



మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.. 'మనందరం సోదరులం, బంధువులం. దేశంలో కులం, మతం, వర్గం పేరుతో కొందరు చిచ్చు పెడుతున్నారు. దేశంలో ఐక్యత ఉంది, నేపాల్ లాంటి పరిస్థితి దేశంలో లేదు' అని వ్యాఖ్యానించారు. ఇక అదే వేదికపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. దత్తాత్రేయ అజాతశత్రువు అని, ఆయనకు మంచి జరగాలని, వందేళ్లు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ.. 'ఐక్యతకు నిదర్శనం అలయ్ బలయ్. సామాన్యుడి సేవ చేయడమే దేవుడి సేవతో సమానం. మన సంస్కృతి అందరూ ఆనందంగా ఉండాలనే చెప్తుంది' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీముర్ము సందేశమిచ్చారు. తెలంగాణ సంస్కృతి, ఆహారపు అలవాట్లను ప్రతిబింబించే విధంగా అలయ్ బలయ్ కార్యక్రమం కొనసాగుతోంది, ఇది సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెబుతోందని కొనియాడారు. సోదరభావాన్ని పెంపొందించే వేడుక 'అలయ్ బలయ్' అన్నారు. అన్ని వర్గాల ప్రజలను ఒక్కచోట చేర్చి తెలంగాణకు చెందిన గొప్ప సంస్కృతిని ప్రదర్శిస్తోందన్నారు. ప్రజల్లో ఐక్యత, సమాజ విలువలను వ్యాప్తి చేసేందుకు ఓ సామాజిక సమావేశంగా ఇది ఉపయోగపడుతోందని స్పష్టం చేశారు. అలయ్ బలయ్ వేడుకలు ఘనంగా జరగాలని కోరుకుంటున్నానని రాష్ట్రపతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. అనంతరం కళాకారులతో కలిసి కాంగ్రెస్ నేత వీహెచ్ డప్పు వాయించి సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, కళారూపాలను ప్రదర్శించే ఈ వేడుక ఆత్మీయతకు ప్రతీకగా నిలిచింది.

**4 వేల కేజీల చికెన్.. 1200 కేజీల మటన్.. 86 రకాల వంటకాలు**

**అలయ్ బలయ్‌లో వంటకాలివి**

బండారు దత్తాత్రేయ నిర్వహించిన 'అలయ్ బలయ్' నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు హాజరైన ఈ వేడుకకు 8 వేల మంది అతిథుల కోసం 86 రకాల వంటకాలు, ముఖ్యంగా 40 క్వింటాళ్ల చికెన్, 12 క్వింటాళ్ల మటన్‌తో భారీ విందు ఏర్పాటు చేశారు. సుదీర్ఘ కాలంగా దత్తాత్రేయ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ఈసారి ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తూ విజయలక్ష్మి ముందుకు నడిపించారు. అలయ్ బలయ్ అంటే కేవలం రాజకీయ కలయిక మాత్రమే కాదు, తెలంగాణ వంటకాల అద్భుతమైన విందు అని చెప్పవచ్చు. ఈసారి నిర్వాహకులు ఆహుతుల కోసం మెనూను అత్యంత వైభవంగా సిద్ధం చేశారు. మొత్తం 86 రకాల రుచులను వండించినట్లు నిర్వాహకులు తెలిపారు. అతిథుల కోసం సుమారు 40 క్వింటాళ్ల (4,000 కేజీలు) చికెన్ కర్రీ మరియు ఫ్రై, మరో 12 క్వింటాళ్ల (1,200 కేజీలు) మటన్ కర్రీ మరియు ఫ్రైని సిద్ధం చేశారు. వీటితో పాటు రొయ్యలు, చేపల పులుసులు , వేపుళ్లు కూడా మెనూలో ఉన్నాయి. ఒకేసారి 500 మంది భోజనం చేయడానికి అనువుగా డైనింగ్ హాళ్లను అమర్చారు. మొత్తం 8 వేల మందికి భోజనాలు అందించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. శాఖాహారంతో సహా మొత్తం 86 రకాల వంటకాలు ఈ విందులో కనువిందు చేశాయి.

**ఆకర్షించిన సాంస్కృతిక ప్రదర్శనలు**

ఈ వేడుకలో 400 మంది కళాకారులు ప్రదర్శించిన ఆటపాటలు హాజరైన వారిని విశేషంగా ఆకర్షించాయి. ఈ సందర్భంగా.. నటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ.. అలయ్ బలయ్ అంటే ఒకరినొకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకోవడం అని, ఇది శ్రీరాముడు ఆంజనేయుని ఆలింగనం చేసుకున్న కాలం నాటి సంస్కృతి అని వివరించారు. ఈ కార్యక్రమం నేటి సమాజానికి ఆప్యాయత, ఆత్మీయతలను అందిస్తుందని అన్నారు.

# విలువలతో కూడిన వృద్ధికి కేరాఫ్ తెలంగాణ

- **పారిశ్రామికాభివృద్ధికి అనుకూలం, అవకాశాల ఖని**
- **పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఆహ్వానం**
- **'జీటో కనెక్ట్ 2025' ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు**



హైదరాబాద్, మహా : విలువలతో కూడిన వృద్ధికి కేరాఫ్ గా తెలంగాణ దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా మారిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. పారిశ్రామికాభివృద్ధికి అత్యంత అనుకూలంగా ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను కోరారు. జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్(జీటో) హైదరాబాద్ ఛాప్టర్ ఆధ్వర్యంలో హైటెక్స్, హెచ్ఐసీసీలలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న 'జీటో కనెక్ట్ 2025'ను కేంద్ర మంత్రులు రాజ్ నాథ్ సింగ్, కిషన్ రెడ్డితో కలిసి శుక్రవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ఒకప్పుడు పారిశ్రామికవేత్తలు ప్రభుత్వాలిచ్చే రాయితీలు, ప్రోత్సాహకాలను చూసే పెట్టుబడులు పెట్టేవారన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఇప్పుడు వారి ఆలోచన తీరు కూడా మారిందన్నారు. ప్రతి అంశాన్ని క్షుణ్నంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటన్నారన్నారు. ముఖ్యంగా వృద్ధి నైతికమైనదా, సమ్మిళితమైనదా, సుస్థిరమైనదా..? అని అధ్యయనం చేసిన తర్వాతే అడుగు ముందుకేస్తున్నారన్నారు. భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా, భవిష్యత్తునే తెలంగాణ నిర్మిస్తోందన్నారు. తెలంగాణ అవకాశాల ఖని అని, పరిశ్రమల ఏర్పాటుకు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే అత్యంత అనుకూల పరిస్థితులున్నాయని వివరించారు. ఇతర ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టే ముందు ఒక్కసారి తెలంగాణలో పర్యటించిన తర్వాత నిర్ణయం తీసుకోవాలని కోరారు. జైన సమాజం 'సేవా' స్ఫూర్తిని, తెలంగాణ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్ తో అనుసంధానిస్తే ప్రపంచం కోరుకుంటున్న నైతిక వృద్ధి నమూనా ఆవిష్కృతమవుతుందన్నారు. నిజమైన యూనికార్న్ అంటే బిలియన్ డాలర్ల విలువ కాదని, లక్షలాది మంది జీవితాలను ప్రభావితం చేయడమని యువ పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలకు సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ యోగా గురువు రాందేవ్ బాబా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు, జీటో హైదరాబాద్ ఛాప్టర్ ప్రతినిధులు రోహిత్ కొఠారి, లలిత్ చోప్రా, విశాల్ అంచాలియా, బీఎల్ భండారీ, సుశీల్ తదితరులు పాల్గొన్నారు.

# అడ్వాన్స్ కంగ్రాచ్యులేషన్స్..

(మొదటిపేజీ తరువాయి)

అందుకోసం ఇప్పటికే సర్వేలు చేయిస్తోందని తెలిపారు. సర్వే నివేదికలను బట్టి గెలుపే ప్రాతిపదికన టిక్కెట్లు వస్తాయని స్పష్టం చేయాలి. టిక్కెట్ రాకపోయినా బాధపడొద్దని, వాళ్లకు పార్టీ పదవులు సహా ఇతరత్రా అన్ని రకాల సహాయం అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ఓడించేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నరు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనలో పంచాయతీలు ఎట్లా నిర్వీర్యమయ్యాయో, కేంద్ర నిధులు ఎలా డైవర్ట్ అయ్యాయో తాజా మాజీ సర్పంచులను అడిగితే వాళ్లే చెబుతారు. చేసిన పనులకు బిల్లులివ్వక పోవడంతో సర్పంచులు తీవ్రంగా నష్టపోయి అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకున్నారు. చాలా మంది సర్పంచులు అప్పులు చెల్లించలేక ఊళ్లో ముఖం చూపలేక ఊరొదిలి హైదరాబాద్ పోయి కూలీ పనులు చేసుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ 22 నెలల పాలనలో గ్రామ పంచాయతీలకు నయాపైసా కూడా ఇయ్యలే. రాష్ట్ర ప్రభుత్వాలు నిధులివ్వకపోవడంతో పంచాయతీల్లో పాలన పడకేసింది. ఏడాదిన్నర కాలంగా ఎన్నికలు జరపకుండా కేంద్ర నిధులు ఆగిపోయాయి. గ్రామాల్లో చెత్త తీద్దామంటే ట్రాక్టర్లకు డీజిల్ పోసేటోడు కూడా దిక్కులేదు. పోనీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు దిక్కేలేదు అని అన్నారు.

# ప్రశాంత్ కిషోర్ సంచలన వ్యాఖ్యలు

## తెలంగాణ వచ్చి మరీ రేవంత్ రెడ్డిని ఓడిస్తా..

### బీహార్ గడ్డపై అడుగు పెడితే రేవంత్ ను తరిమి కొడతా
### మోదీ, రాహుల్ గాంధీ కూడా రేవంత్‌ను కాపాడలేరు

(మొదటిపేజీ తరువాయి)



రేవంత్ రెడ్డి మీద సంచలన ఆరోపణలు చేస్తున్నారు. తాజాగా మరోసారి రేవంత్ రెడ్డి మీద విరుచుకుపడ్డ ప్రశాంత్ కిషోర్.. తెలంగాణ వచ్చి మరీ రేవంత్ రెడ్డిని ఓడిస్తానంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిహార్ ప్రజల గురించి అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో సందర్భం దొరికిన ప్రతిసారి రేవంత్ రెడ్డి మీద ప్రశాంత్ కిషోర్ ఫైర్ అవుతూనే ఉన్నారు. బిహార్ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తరఫున రేవంత్ రెడ్డితో ప్రచారం చేపించాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. దీనిపై ప్రశాంత్ కిషోర్ స్పందిస్తూ.. బిహార్ ప్రజలను తక్కువ చేసి హేళనగా మాట్లాడిన రేవంత్ రెడ్డి తమ గడ్డపై అడుగు పెడితే తరిమి కొడతానని హెచ్చరించారు. తాజాగా ఓ జాతీయ మీడియాతో జరిగిన ఇంటర్వ్యూలో పీకే మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో తెలంగాణకి వెళ్లి మరీ రేవంత్ రెడ్డిని ఓడించి తీరుతానని సంచలన వ్యాఖ్యలు చేశాడు. మోదీ, రాహుల్ గాంధీ ఎవరూ కూడా తన నుంచి రేవంత్ రెడ్డిని కాపాడలేరన్నారు. బీజేపీ, టీడీపీ ఇలా అన్ని పార్టీలు తిరిగి.. చివరకు కాంగ్రెస్ పార్టీలో చేరి.. అతి కష్టం మీద రేవంత్ రెడ్డి ఒకసారి ముఖ్యమంత్రి అయ్యారని ప్రశాంత్ కిషోర్ ఎద్దేవా చేశారు. మరోసారి తిరిగి గెలిచే సత్తా రేవంత్ రెడ్డికి లేదని విమర్శించారు. అలాగే బీహార్ ప్రజల డీఎన్ఏ తెలంగాణ ప్రజల డీఎన్ఏ కంటే తక్కువ అంటూ చిన్న చూపు చూసిన రేవంత్.. ఢిల్లీ వచ్చి మరీ.. తనకు సాయం చేయాలంటూ మూడు సార్లు.. తనను ఎందుకు అడిగారని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో రాహుల్ గాంధీ, మోదీ ఎవరూ కూడా రేవంత్ రెడ్డిని తన నుంచి కాపాడలేరని స్పష్టం చేశారు. తెలంగాణ వచ్చి మీ రేవంత్ రెడ్డిని ఓడించి తీరతానని ప్రశాంత్ కిషోర్ ఈ సందర్భంగా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో బిహార్ ప్రజలను దూషిస్తూ రాజకీయాలు చేస్తున్నారని ప్రశాంత్ కిషోర్ మండిపడ్డారు. తాము ఎవరి గురించి అయినా తప్పుగా, తక్కువ చేసి మాట్లాడామా అని ఆయన ప్రశ్నించారు. బిహార్ ప్రజలు వారి పొలాల్లో పనులు చేస్తున్నారుగా... అలాంటి వారిని ఎందుకు తిడుతున్నారని ప్రశాంత్ కిషోర్ ప్రశ్నించారు. వారు బీహార్ ప్రజలను తక్కువ చేసి మాట్లాడితే తాము తెలంగాణ ప్రజల గురించి మాట్లాడాల్సి వస్తుందన్నారు.

# మధ్యప్రదేశ్ లో టమాటా వైరస్ కలకలం

## చిన్నారుల్లో ఎక్కువ కేసులు.. మధ్యప్రదేశ్‌ను వణికిస్తున్న వైరస్

**మహా :** మధ్యప్రదేశ్ రాష్ట్రంలో 'టమాటా వైరస్' రూపంలో ఓ కొత్త ఆరోగ్య సంక్షోభం తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ప్రధానంగా పాఠశాలలకు వెళ్లే చిన్నారులే లక్ష్యంగా ఈ వైరస్ శరవేగంగా వ్యాపిస్తుండటం కలకలం రేపుతోంది. ఆగస్టు, సెప్టెంబర్ నెలల వ్యవధిలోనే భోపాల్, ఇండోర్, జబల్‌పూర్ వంటి ప్రధాన నగరాల్లో 200కు పైగా కేసులు వెలుగు చూడటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. వైద్యులు దీనిని 'హ్యాండ్‌ఫుట్ మౌత్ డిసీజ్' (హెచ్ఎఫ్ఎండీ) రకంగా గుర్తించారు. ముఖ్యంగా 6 నుంచి 13 సంవత్సరాల వయసున్న పిల్లలలో ఈ వ్యాధి ప్రభావం అధికంగా కనిపిస్తుండగా, రాష్ట్రవ్యాప్తంగా 50కి పైగా పాఠశాలల్లో క్లస్టర్ కేసులుగా ఇది బయట పడింది. వర్షాకాలం అనంతరం వాతావరణంలో పెరిగిన వేడి, తేమ ఈ వైరస్ వ్యాప్తికి మరింత ఆజ్యం పోస్తున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

**ఇవి వ్యాధి లక్షణాలు**

టమాటా వైరస్ ఒకరి నుంచి మరొకరికి చాలా సులభంగా వ్యాపిస్తుంది. వ్యాధి సోకిన పిల్లలు మాట్లాడినప్పుడు, దగ్గినప్పుడు లేదా తుమ్మినప్పుడు వెలువడే తుంపర్ల ద్వారా, వారి లాలాజలం, ముక్కు నుంచి కారే ద్రవాల ద్వారా ఇది ఇతరులకు సోకుతుంది. పాఠశాలలు, ఆసుపత్రులు వంటి రద్దీ ప్రదేశాలలో పిల్లలు ఒకరినొకరు దగ్గరగా తాకడం, ఆట వస్తువులను పంచుకోవడం వల్ల వ్యాప్తి మరింత వేగవంతమవుతోంది. 2022లో తొలిసారిగా కేరళలో 'టమోటా ఫ్లూ' పేరుతో వెలుగులోకి వచ్చిన ఈ వ్యాధి, ఆ తర్వాత ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోనూ తన ప్రభావాన్ని చూపింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, ఆసియా దేశాల్లో



ఏటా లక్షలాది మంది చిన్నారులు హ్యాండ్‌ఫుట్ మౌత్ డిసీజ్ బారిన పడుతున్నారు. ఈ వైరస్ సోకిన 3 నుంచి 6 రోజుల్లో లక్షణాలు బయటపడతాయి. తొలుత తీవ్రమైన జ్వరం, గొంతు నొప్పి, నీరసం, అలసట వంటివి కనిపిస్తాయి. ఆ తర్వాత ఒకటి రెండు రోజుల్లో చేతులు, పాదాలు, నోటి చుట్టూ, పిరుదుల వద్ద టమోటాల్లాంటి ఎర్రటి నీటి పొక్కులు (దద్దుర్లు) ఏర్పడతాయి. సుమారు 2 నుంచి 6 మిల్లీమీటర్ల పరిమాణంలో ఉండే ఈ పొక్కుల వల్ల నొప్పి ఉండకపోయినా, అవి పగిలి పుండుగా మారితే మాత్రం తీవ్రమైన మంట, నొప్పి కలుగుతాయి. ముఖ్యంగా నోటిలో పుండ్లు ఏర్పడటం వల్ల పిల్లలు ఆహారం తీసుకోవడానికి తీవ్రంగా ఇబ్బంది పడతారు. మధ్యప్రదేశ్‌లో నమోదైన కేసుల్లో దాదాపు 70 శాతం 8 నుంచి 10 ఏళ్ల వయసు పిల్లల్లోనే ఉండటం గమనార్హం. చాలా అరుదైన సందర్భాల్లో ఈ వైరస్ మెదడువాపు (ఎన్‌సెఫలైటిస్) లేదా మెనింజైటిస్ వంటి తీవ్ర అనారోగ్యాలకు దారితీసే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

**చర్యలు, నివారణ మార్గాలు**

టమాటా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు మధ్యప్రదేశ్ ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. రాష్ట్రవ్యాప్తంగా 100కు పైగా పర్యవేక్షణ బృందాలను రంగంలోకి దించింది. ఈ బృందాలు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ ఆరోగ్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. వ్యాధి నిర్ధారణ కోసం గొంతు లేదా మలం నమూనాలను సేకరించి వైరల్ పరీక్షలు చేయాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం ఈ వైరస్‌కు ప్రత్యేకంగా చికిత్స ఏదీ లేదు. జ్వరం, నొప్పిని తగ్గించడానికి పారాసెటమాల్ వంటి మందులు వాడాలని వైద్యులు చెబుతున్నారు. 90 శాతం కేసులు ఇంట్లోనే సరైన సంరక్షణతో 7 నుంచి 10 రోజుల్లో వాటంతట అవే తగ్గిపోతాయి. ఈ వైరస్ బారిన పడకుండా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రతే కీలకమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పిల్లలు తరచూ సబ్బుతో చేతులు శుభ్రం చేసుకునేలా చూడాలి. వ్యాధి సోకిన పిల్లలను కనీసం 7 నుంచి 10 రోజుల పాటు పాఠశాలలకు పంపకుండా ఇంట్లోనే ఐసోలేషన్‌లో ఉంచాలి. పాఠశాలల్లో తరగతి గదులను, ఆట వస్తువులను ఎప్పటికప్పుడు శానిటైజ్ చేయాలి. ప్రస్తుతం భారత్‌లో ఈ వైరస్‌కు వ్యాక్సిన్ అందుబాటులో లేదు. మధ్యప్రదేశ్‌లో ఇప్పటివరకు ఎలాంటి మరణాలు సంభవించనప్పటికీ, నిర్లక్ష్యం వహిస్తే కేసుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి, పిల్లల్లో ఏవైనా లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని అక్కడి ఆరోగ్య శాఖ అధికారులు సూచిస్తున్నారు.

# తేడా జరిగితే మ్యాప్ నుంచి లేపేస్తాం

## పాకిస్థాన్ కు ఆర్మీ చీఫ్ వార్నింగ్..

### ఆపరేషన్ సింధూర్ ఈ సారి వేరే లెవెల్

**మహా:** ఈసారి పాకిస్థాన్ దుస్సాహసం చేస్తే.. భారత్ సంయమనం పాటించదని మ్యాప్ నుంచి లేపేస్తామని ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరికలు జారీచేశారు. ఆ దేశం ఎగదోస్తున్న ఉగ్రవాదాన్ని ఆపాలని హితవు పలికారు. భారత్‌పైకి ఎలాంటి దుస్సాహసానికి పాల్పడినా.. పాక్ భౌగోళిక స్థితి మారుతుందని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించిన మరుసటి రోజే ఆర్మీచీఫ్ సంచలన వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఏదో జరుగుతోందనే అభిప్రాయం బలపడుతోంది. గుజరాత్ నుంచి కరాచీ దారి ఉందనే విషయం మర్చిపోవద్దని పాకిస్థాన్‌ను తీవ్రంగా హెచ్చరించారు భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ. పాక్.. దేశ ఎజెండాగా ఎగదోస్తున్న ఉగ్రవాదాన్ని ఆపకపోతే.. ఈసారి తాము సంయమనం పాటించేది లేదని తేల్చిచెప్పారు. "ఈసారి ఆపరేషన్ సిందూర్ 1.0లో లాగా సంయమనాన్ని పాటించము. పాకిస్థాన్ తన భౌగోళిక రూపాన్ని కాపాడుకోవాలనుకుంటుందా లేదా అని ఆలోచించుకునేటట్లు ఈసారి చేస్తాం. పాకిస్తాన్ భౌగోళికంగా ఇప్పుడెలా ఉందో అలాగే ఉండాలనుకుంటే.. తాము భారత్‌పైకి ఎగదోస్తున్న ఉగ్రవాదాన్ని ఆపాలి" అని జనరల్ ద్వివేది అన్నారు.

# లోకల్ బాడీ ఎన్నికల్లో కాంగ్రెస్ తో కలిసి వెళ్తాం

## సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

**హైదరాబాద్, మహా :** స్థానిక సంస్థల ఎన్నికలలో సీట్ల సర్దుబాటు విషయంలో కలిసి వచ్చే కాంగ్రెస్, సిపిఐ(ఎం), వామపక్షపార్టీలతో కలిసి ముందుకెళ్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. బిసి రిజర్వేషన్ల విషయంలో ఈ నెల 8న వెలువడనున్న కోర్టు తీర్పు ఆధారంగా, ఆ కేసులో సిపిఐ కూడా ఇంప్లీడ్ అయ్యే విషయంలో, అలాగే స్థానిక సంస్థల ఎన్నికల అంశంపైన ఈ నెల 5వ తేదీన జరిగే సిపిఐ రాష్ట్ర సమితి సమావేశంలో ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. బిసి రిజర్వేషన్ల విషయంలో అందరూ కలిసి కృషి చేద్దామని చెప్పకుండా, రిజర్వేషన్లు సాధ్యమా? అంటూ బిసిలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, రిజర్వేషన్ల అంశంలో చాలా మంది 'డబల్ డ్రామాలు' ఆడుతున్నారని దుయ్యబట్టారు. శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి, జాతీయ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్ పాషా, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి నర్సింహ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్. బోస్ తో కలిసి కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల బిల్లులు చెల్లుబాటు అవుతాయా? లేదా? అనే చర్చలు జరుగుతున్నాయని, ఇటీవల శాసనసభలో ఆ బిల్లులకు అన్ని రాజకీయ పార్టీలు అమోదం తెలిపాయని గుర్తు చేశారు. ఇడబ్ల్యూఎస్ పది శాతం రిజర్వేషన్లను పెంచడంతో రిజర్వేషన్లపైన ఉన్న 50 శాతం పరిమితి ఎప్పుడో దాటిందన్నారు. రాష్ట్రంలో బలమైన జెడ్ పీపీ, ఎంపిపి, సర్పంచ్ స్థానాలను గుర్తించి, ఆ స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధమవ్వాలని తమ పార్టీ శ్రేణులకు ఇది వరకే పిలుపునిచ్చినట్టు కూనంనేని వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రస్తావించిన సామాజిక కార్యకర్త సోనంను అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. నిరంకుశత్వంగా పరిపాలించాలని మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భారతదేశ ప్రజలను అవమానించే విధంగా వ్యవహరిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రధాని మోదీ పల్లెత్తు మాట కూడా అనడం లేదన్నారు. ట్రంప్ చేసే తప్పులను కూడా మోదీ ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. అమెరికాలో చదువుతున్న వారు లక్ష డాలర్లు చెల్లించాలనడం అన్యాయమని, అమెరికాలో భారత వ్యాపార సంస్థలపై విధిస్తున్నట్టు భారతదేశంలోని అమెరికా వ్యాపారాలపైన కూడా పన్నులు విధించే అవసరం ఉంటుందని అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విషయంలో ప్రధాని మోదీ తన వైఖరిని స్పష్టం చేయాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఏ జాతికి ద్రోహం జరిగినా, ఆ జాతికి భారతదేశం మద్దతుగా ఉండేదని గుర్తు చేశారు. సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ భారతదేశ వృద్ధి 0.3 శాతం తగ్గిందని, ఉత్పత్తి రంగం 6 నుంచి 3.6 శాతానికి తగ్గిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్పత్తి రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరంఎంతైనా ఉందన్నారు. ఆయుధ సరఫరాలో భారతదేశం రెండవ స్థానంలో నిలిచిందన్నారు.

ANN తెలుగు
# మహా పత్రిక
03
శనివారం, హైదరాబాద్ | 04-10-2025 | జనరల్ వార్తలు | GENERAL NEWS | WWW.MAHAADAILY.COM



## నిందితులు అరెస్టు

**మహా :** మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధి పాల చెట్టు ఏరియాలో గురువారం రాత్రి పరస్పర దాడులకు పాల్పడిన ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు స్థానిక సిఐ శశిధర్ రెడ్డి తెలిపారు. పాల చెట్టు ఏరియాలో ఉన్న పచ్చిక రవితేజ, బండ రాకేష్ అనే యువకులపై, మందమర్రి విద్యానగర్ కు చెందిన కొందరు యువకులు ఆటోలో వచ్చి, ఆటో యు టర్న్ చేసుకునే సందర్భంలో అదే సమయంలో బైక్ మీద ఆ రోడ్డు వెంబడి ఇద్దరు యువకులు ఆటోకు అడ్డు రాగా చిన్న పాటి విషయానికి అక్కడ ఘర్షణకు జరిగినట్లు తెలిపారు. తాగిన మైకంలో ఉన్న యువకులందరూ కలిసి బాధితులపై చేతులతో, కర్రలు, రాళ్లతో విచక్షణారహితంగా దాడి చేసుకున్నారని అన్నారు. ఈ దాడిలో పచ్చిక రవితేజ తలకు గాయాలయ్యాయని వెల్లడించారు. బాధితుడు పచ్చిక రవితేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆటోలో వచ్చి దాడి చేసిన యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా జిల్లపల్లి ఆకాష్,కోట మహేష్,రెండ్ల శ్రీకాంత్, దానబోయిన నవీన్ కుమార్, పులి సతీష్, జిల్లపల్లి ఆకాష్ తో పాటు మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రధాన నిందితుడు జిల్లపల్లి ఆకాష్ అతని స్నేహితుడు పరారీలో ఉన్నాడని వెల్లడించారు. యువకులు చిన్నపాటి విషయాలకు ఘర్షణ పడి విలువైన సమయాన్ని వృధా చేసుకోరాదని అన్నారు. ఇలాంటి అల్లర్లకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

# వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను

### సంగారెడ్డి నుంచి నా భార్య పోటీ చేస్తుంది.. కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు



**సంగారెడ్డి, మహా :** కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సంచలన ప్రకటన చేశారు. వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేయడం లేదని ప్రకటించారు. ఆయన నిర్ణయం అటు పార్టీ వర్గాలను మాత్రమే అభిమానులను కూడా ఆశ్చర్యపరిచింది. దసరా పండగా నాడు నిర్వహించి రావణ దహన కార్యక్రమంలో పాల్గొన్న జగ్గారెడ్డి ఈ సంచలన ప్రకటన చేసి ప్రతి ఒక్కరిని ఆశ్చర్యపరిచారు. దసరా పండగ సందర్భంగా అంబేద్కర్ స్టేడియంలో రావహ దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జగ్గారెడ్డి దంపతులు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తాను పోటీ చేయడం లేదని ప్రకటించారు. అయితే జగ్గారెడ్డి బదులు ఆయన భార్య నిర్మల పోటీ చేస్తారని తెలిపారు. పది సంవత్సరాల తర్వాత తిరిగి మళ్లీ తాను ఎన్నికల్లో పోటీ చేస్తానని జగ్గారెడ్డి ప్రకటించారు. ఈ పది సంవత్సరాలు రాజకీయాల నుంచి దూరంగా ఉండనున్నట్లు ప్రకటించారు. అంతేకాక తనను మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గం కోసం ఏం చేయాలో అంతా చేశానని అన్నారు. ముందుగానే క్లారిటీ ఇవ్వడం అవసరం అని వ్యాఖ్యానించారు. "నేను పదేళ్ల తర్వాత మళ్లీ సంగారెడ్డిలో పోటీ చేస్తా. మధ్యలో ఇంకెవరైనా రావొచ్చు. అందుకే ఇప్పుడే చెబుతున్నా. వచ్చే ఎన్నికల్లో నేను పోటీ చేయను. నా స్థానంలో నా భార్య నిర్మల పోటీ చేస్తుంది" అని పేర్కొన్నారు. యువతకు కీలక సూచనలు చేశారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు బానిసలై.. బంగారం లాంటి జీవితాలను నాశనం చేసుకోవద్దని జగ్గారెడ్డి కోరారు. అలానే అతి వేగంగా వాహనాలు నడపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇక జగ్గారెడ్డి ప్రకటన రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. సంగారెడ్డిలో జగ్గారెడ్డి ప్రభావం బలంగా ఉంది. దీంతో ఆయన బదులు.. ఆ స్థానంలో ఆయన భార్య నిర్మల అభ్యర్థిత్వానికి మంచి అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. జగ్గారెడ్డి మద్దతుతో నిర్మల పోటీ చేస్తే కాంగ్రెస్ పార్టీకి బలమైన స్థానం దక్కుతుందని భావిస్తున్నారు. మొత్తానికి ఒక్క ప్రకటనతో జగ్గారెడ్డి రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

## దామోదర్ రెడ్డికి నివాళులర్పించిన సీఎం రేవంత్



**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి బుధవారం రాత్రి అనారోగ్యంతో కన్నుమూసిన విషయం తెలిసిందే. శనివారం ప్రజల సందర్శనార్థం నగరంలోని జూబ్లీ హిల్స్ లోని దామోదర్ రెడ్డి నివాసంలో పార్థీవ దేహాన్ని ఉంచారు. ఈ క్రమంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అక్కడకు చేరుకుని పార్థివదేహానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాంరెడ్డి దామోదర్ రెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీతో పాటు నల్గొండ జిల్లా ప్రజలకు తీరని లోటని అన్నారు. అంతకు ముందు మంత్రులు పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మేయర్ గద్వాల విజయలక్ష్మి నివాళులు అర్పించారు.

## కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆర్థిక విధ్వంసం

- జీఎస్టీ వసూళ్ల వృద్ధిలో దేశంలోనే అట్టడుగుకు పతనం
- కేసీఆర్ హయాంలో రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచిందన్న కేటీఆర్
- రేవంత్ రెడ్డి అనుభవలేమి, అరాచకత్వమే కారణం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం



**హైదరాబాద్, మహా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ సంపూర్ణ విధ్వంసానికి గురైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. తాజాగా, సెప్టెంబర్ 2025 నెలలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్ల వృద్ధి రేటులో తెలంగాణ దేశంలోనే అట్టడుగున ఉండటం దారుణమని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఆర్థిక విధ్వంసానికి సంబంధించిన మరో స్పష్టమైన సూచిక ఇదేనని ఆయన పేర్కొన్నారు. సరిగ్గా రెండేళ్ల క్రితం, కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని ఆయన గుర్తు చేశారు. జీఎస్టీ వృద్ధిలో ఈ పతనం, రేవంత్ రెడ్డి పరిపాలనలో రాష్ట్ర ఆర్థికవ్యవస్థ ఎంత విధ్వంసం పాలయ్యిందో చెప్పే ఒక నిదర్శనమని కేటీఆర్ ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయం నుండి ఐటీ వరకూ అన్ని రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం గట్టి దన్ను ఇవ్వడంతో ఆర్థికవ్యవస్థ పరుగులు తీసి, రికార్డులు తిరగరాసిందని కేటీఆర్ తెలిపారు. కానీ, నేడు కాంగ్రెస్ పాలనలో, పండుగ వచ్చినా, పబ్బం వచ్చినా కూడా అన్ని రంగాలూ నేలచూపులే చూస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయం నుండి రియల్ ఎస్టేట్ వరకూ అన్ని రంగాల్లోనూ దైన్యమే తాండవిస్తోందని మండిపడ్డారు. "అరాచకత్వం, అవినీతి, అనుభవలేమి కలగలసిన రేవంత్ పాలనలో తెలంగాణ ఆర్థిక విధ్వంసానికి గురవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విధ్వంసాన్ని వెంటనే ఆపడానికి చర్యలు తీసుకోవాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.



## ప్రజావాణి రద్దు

### జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**యాదాద్రి భువనగిరి, మహా:** స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరిగిందదని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు శుక్రవారం నాడు తెలిపారు. జెడ్పిటిసి ఎంపీటీసీ, స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరగదని కలెక్టర్ హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లాలోని ప్రజలంతా గమనించి సహకరించాలని , ఫిర్యాదులు ఇచ్చేందుకు రావద్దని తెలిపారు.

# దసరా కిక్కు

### 2 రోజుల్లోనే రూ.419 కోట్ల మద్యం అమ్మకాలు

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో దసరా సందర్భంగా రెండు రోజుల పాటు రూ. 419 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. తెలంగాణ ప్రజలు దసరాను ఘనంగా జరుపుకుంటారు. అయితే ఈ సారి దసరా గాంధీ జయంతి రోజున వచ్చింది. గాంధీ జయంతి రోజున మద్యం, మాంసం దుకాణాలు బంద్. అయినా కూడా మద్యం విక్రయాలు మాత్రం తగ్గలేదు. దసరా పండుగ నేపథ్యంలో ఒక్క రోజు ముందే మందు ప్రియులు లిక్కర్ కొనుగోలు చేశారు. మద్యం దుకాణాల వద్ద గాంధీ జయంతి రోజున లిక్కర్ దుకాణాలకు సెలవు అంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో ముందు జాగ్రత్తగా ఒక్క రోజు ముందే మద్యం కొనుగోలు చేశారు. ఇక మాంసాన్ని కూడా ఒక్క రోజు ముందే కొనుగోలు చేశారు. ఈ ఏడాది సెప్టెంబర్ 30, అక్టోబర్ 1 తేదీల్లో రాష్ట్రంలో మద్యం విక్రయాలు ఎక్కువగా జరిగాయి. సెప్టెంబర్ 30న రూ. 333 కోట్లు, అక్టోబర్ 1న, 86 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయని ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. దసరా పండుగను పురస్కరించుకుని సెప్టెంబర్ 26 నుంచి లిక్కర్ సేల్స్ పెరిగాయి. సెప్టెంబర్ 29న 278.66 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. ఇక సెప్టెంబర్ మాసంలో రూ.2,715 కోట్ల ఆదాయం వచ్చింది. సెప్టెంబర్ 1 నుంచి 29 వరకు 26.71 లక్షల లిక్కర్ కేసులు, 33.24 లక్షల బీర్ల కేసులు అమ్ముడయ్యాయి. 2023 దసరా పండుగ 9 రోజుల్లో రూ.1,057 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. ఇక 2024లో దసరా సందర్భంగా రూ. 1,100 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. కేవలం 10 రోజుల్లోనే ఇంత పెద్ద ఎత్తున మద్యం విక్రయాలు జరిగాయి. సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 11 వరకు 10.44 లక్షల మద్యం కేసులు, 17.59 లక్షల కేసుల బీర్లు విక్రయించారు. దీని విలువ రూ. 1100 కోట్లు. మద్యం అమ్మకాల్లో ఉమ్మడి రంగారెడ్డి టాప్ లో నిలిచింది. ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి నల్గొండ, ఉమ్మడి వరంగల్ జిల్లాలు వరుస స్థానాల్లో నిలిచాయి.

# స్థానిక సంస్థల ఎన్నికలు

- అభ్యర్థుల ఖర్చుపై ఈసీ స్పష్టత
- జడ్ పీటీసీ అభ్యర్థి, రూ. 4 లక్షలు, ఎంపీటీసీ అభ్యర్థి రూ. 1.50 లక్షలు

**హైదరాబాద్, మహా :** జెడ్పిటిసి, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థుల ఖర్చు పరిమితిని ఎలక్షన్ కమిషన్ ప్రకటించింది. జెడ్పిటిసి అభ్యర్థి రూ 4 లక్షలు, ఎంపీటీసీ అభ్యర్థి రూ 1,50 లక్షల వ్యయ పరిమితి ఉంది. అభ్యర్థులు పోటీ చేసే ప్రాంతంలో రాజకీయ పార్టీలు చేసే ఖర్చు కూడా అభ్యర్థి ఖాతాలోనే జమకానుందని ఈసీ ప్రకటించింది. సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్న అభ్యర్థి 2011 జనాభా లెక్కల ప్రకారం 5 వేల జనాభా కంటే ఎక్కువ ఉన్న గ్రామపంచాయతీకి రూ 2,50 లక్షలు, వార్డు సభ్య అభ్యర్థి రూ 50 వేలు, 5వేల జనాభా కంటే తక్కువ ఉన్న గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థి రూ 1,50 లక్షలు, వార్డు సభ్య అభ్యర్థి రూ 30 వేలు వ్యయం చేయడానికి పరిమితి ఉంది. జడ్పిటిసి, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసిన అభ్యర్థులు 45 రోజుల్లో తమ ఎన్నికల ఖర్చుల తుది నివేదికలు సంబంధిత అధికారికి సమర్పించాలి. ఎన్నికల వ్యయ ఖర్చులు సమర్పించికపోతే గెలిచిన పదవి కోల్పోవడంతో పాటు పంచాయతీరాజ్ చట్టం ప్రకారం మూడేళ్ల పాటు ఎన్నికల్లో పోటీకి అనర్హులవుతారని స్పష్టం చేసింది.

## ప్రమాదం అంచున ఆలేరు-కొలనుపాక బ్రిడ్జ్

### వాహనదారులు జెర్ర జాగ్రత్త




**ఆలేరు, మహా :** కొలనుపాక పెద్దవాగు వద్ద బ్రిడ్జ్ పర్రె పట్టి ప్రమాదం పొంచివుంది.. ఇటు ఆలేరు అటు కొలనుపాక ,సిద్దిపేట వైపు వెళ్లె వాగనదారులకు ఆ బ్రిడ్జ వద్ద అనేక ఇబ్బందులు ఎదుర్తెతున్నాయి ద్వి చక్ర వాహనదారులు ప్రాణాలు అరి చేతిలో పెట్టుకొని ప్రయాణం సాగిస్తున్నారు... కొందరు ప్రమాదాలకు గుర్తెతున్నారు కూడ... యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం నుండి కొలనుపాక ,సిద్దిపేట వైపు వెళ్లె ప్రయాణికులకు అక్కడ హై లెవల్ బ్రిడ్జ మంజూరు అయిన నిర్మాణం జాప్యం కావడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు... ఈ బ్రిడ్జ నిర్మాణానికి గత ప్రభుత్వం 4 కోట్ల రూపాయలు మంజూరు చేసి అప్పటి ఎమ్మెల్యే బ్రిడ్జ్ పనులకు శంకుస్థాపన కూడ చేశారు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి అధికారం రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి.. కాంగ్రెస్ అధికారం వచ్చాక లో లెవల్ బ్రిడ్జ్ నుండి హై లెవల్ బ్రిడ్జ్ కి 4 నుండి 7 .50 కోట్లు మంజూరు చేసిన వర్షాలు, వరదల కారణంగా నీటి ప్రవాహం ఆగకపోవడం బ్రిడ్జ నిర్మాణం పనులు చెపట్టక పోవడం బ్రిడ్జ వద్ద రోడ్డు పర్రెలు పట్టి ప్రమాదం అంచున ఉంది... వెంటనే కొలనుపాక గ్రామ అఖిల పక్ష నాయకులు ప్రమాదాలు జరగకుండా బారీ కేడ్లు ఏర్పాటు చేశారు... బ్రిడ్జ నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన చెపట్టాలని డిమాండ్ చేస్తున్నారు బారీ కేడ్ల వద్ద ప్రయాణికులకు ఆలేరు పోలీసులు సూచనలు చేస్తున్నారు.



## బునాదిగాని కాల్వ ద్వారా కళకళలాడుతున్న చెరువులు

### చెరువు వద్ద భువనగిరి ఎమ్మెల్యే పూజలు

**భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పహిల్ వాన్ పురం చెరువు బునాదిగాని కాల్వ పనులతో నిండి జలకళ సంతరించుకుంది. శుక్రవారం నాడు బునాదిగాని కాల్వతో నిండిన చెరువుల వద్ద భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ శ్రేణులు గ్రామస్థులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బూనాదిగాని,పిలాయిపల్లి,ధర్మారెడ్డి కాలువలకు గతంలో 500 కోట్లు కేటాయింపు జరిగిందని ఒక్క బునాదిగాని కాల్వకే 269 కోట్లు కేటాయించారని తను ఎమ్మెల్యే అయ్యాక కాల్వపనులు వేగవంతం చేసినట్లు ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి చెప్పారు...

## తృటిలో తప్పిన పెను ప్రమాదం..

### ఊపిరి పీల్చుకున్న కాలనీ వాసులు...

**విజయనగరం, మహా:** విజయనగరం జిల్లా,బొబ్బిలి పట్టణం,తారకరామ కాలనీలో అంబేద్కర్ బొమ్మ లైన్ లో పాడుబడిన బాల బడి అనే పేరుతో ఉన్న స్కూల్ స్లాబ్ ముందు భాగం కుప్పకూలిపోయింది. ఈ కూలిపోవడం అతి పెద్ద శబ్దం రావడంతో ఆ కాలనీ వాసులు అంతా భయాందోళనకు గురయ్యారు.. పాడుబడిన స్కూలు దగ్గరలో ఎవరూ లేకపోవడం వలన ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు అని స్థానికులు తెలిపారు. కొన్ని రోజులుగా బొబ్బిలి పట్టణంలో అతి భారీ వర్షాలు కురవడంతో ఈ సంఘటన జరిగిందని కాలనీ వాసులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు..



## సొంత ఊరిలో దసరా వేడుకలు

### ప్రభుత్వ విప్ ఆలేరు బీర్ల అయిలయ్య

**ఆలేరు, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని సైదాపూర్ గ్రామంలోతెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య దసరా పండుగ వేడుకల్లో పాల్గొన్నారు.. ముందుగా యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రభుత్వ విప్ కార్యాలయంలో ఆయుధపూజ కార్యక్రమంలో పాల్గొని అనంతరం సైదాపూర్ వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఆ తర్వాత వాహన పూజ కార్యక్రమం ముగించుకొని గ్రామంలోని జమ్మి చెట్టు వద్ద ప్రదక్షిణలు చేసి ప్రత్యేక పూజలు పాల్గొన్నారు మరోసారి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు..

# ఐదేళ్ళ నిషేదానికి ముగింపు

### త్వరలో భారత్, చైనా మధ్య నేరుగా విమాన సర్వీసులు
### మెరుగుపడనున్న ద్వైపాక్షిక సంబంధాలు

**మహా :** భారత్, చైనా సంబంధాలను క్రమంగా సాధారణ స్థితికి తీసుకొచ్చే దిశగా మరో ముందడుగు పడింది. ఈ నెలలో ఇరుదేశాల మధ్య నేరుగా విమానాల రాకపోకలను తిరిగి పునరుద్ధరించనున్నట్లు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. హిమాలయాల బోర్డర్‌లో జరిగిన తీవ్ర సైనిక ఘర్షణల తర్వాత, 2020 నుంచి ఇరుదేశాల మధ్య నేరుగా నడిచే విమానాల సర్వీసులు నిలిచిపోయాయి. గత ఏడాది కాలంగా.. సరిహద్దు వద్ద ఉద్రిక్తతలను తగ్గించేందుకు భారత్, చైనా చర్యలు చేపట్టడంతో పాటు సంబంధాలను పునరుద్ధరించుకునే దిశగా కృషి చేస్తున్నాయి. అక్టోబర్ 26 నుంచి కోల్‌కతా, గ్వాంగ్‌జౌ నగరాల మధ్య విమాన సర్వీసులను పునఃప్రారంభించనున్నట్లు విమానయాన సంస్థ ఇండిగో తెలిపింది. విమానాల పునరుద్ధరణతో ఇరుదేశాల "ప్రజల మధ్య సంబంధాలు సులభతరమవుతాయి. ద్వైపాక్షిక సంబంధాలను పెంపొందించేందుకు దోహదపడుతుంది" అని గురువారం విడుదల చేసిన ప్రకటనలో భారత విదేశాంగ శాఖ పేర్కొంది.

భారత్, చైనా 3,440 కిలోమీటర్లకి పైగా పొడవున సరిహద్దును పంచుకుంటున్నాయి. ఇందులో కొన్నిచోట్ల కచ్చితమైన సరిహద్దు లేదు, రెండు దేశాలు ఆయా ప్రాంతంపై తమకు హక్కు ఉందని పేర్కొంటున్నాయి. 2020లో, గల్వాన్ లోయలో ఇరుదేశాల దళాలు ఘర్షణ పడ్డాయి. ఈ ఘర్షణలో కనీసం 20 మంది భారతీయ సైనికులు, నలుగురు చైనా సైనికులు మరణించారు. 1975 తర్వాత ఇరువర్గాల మధ్య తీవ్ర స్థాయిలో జరిగిన ఘర్షణ ఇది. ఇరుదేశాల మధ్య సంబంధాలు స్తంభించిపోవడానికి దారితీసింది. అయితే, గత ఏడాది కాలంగా దెబ్బతిన్న సంబంధాలను క్రమంగా బలోపేతం చేసుకునేందుకు బీజింగ్, దిల్లీ చర్యలు చేపడుతున్నాయి. రెండు వైపుల నుంచి ఉన్నత స్థాయి అధికారులు అనేక దశల చర్చలు, సమావేశాలు నిర్వహించారు. గత ఏడాది అక్టోబర్‌లో, వివాదాస్పద హిమాలయ సరిహద్దులో ఉద్రిక్తతలను తగ్గించే దిశగా భారతదేశం, చైనా పెట్రోలింగ్ ఏర్పాట్లకు అంగీకరించాయి. ఈ ఏడాది, టిబెట్ అటానమస్ రీజియన్ అని పిలిచే కొన్ని మతపరమైన ప్రాముఖ్యత కలిగిన ప్రదేశాలను సందర్శించడానికి భారతీయ యాత్రికులను చైనా అనుమతించింది. భారత్ కూడా చైనా పర్యటకులకు వీసా సేవలను పునఃప్రారంభించింది. నిర్దేశిత పాసుల ద్వారా సరిహద్దు వాణిజ్యానికి సంబంధించిన చర్చల పున:ప్రారంభానికి అంగీకరించింది.

అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ విధించిన భారీ సుంకాలతో భారత్అమెరికా మధ్య సంబంధాలు క్షీణించడం కూడా దిల్లీ, బీజింగ్ సంబంధాలు మెరుగయ్యేందుకు మరో కారణంగా చెప్పొచ్చు. ఆగస్టులో, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ భారత్‌లో పర్యటించారు. భారత్, చైనా ఒకరినొకరు "విరోధులు"గా కాకుండా "భాగస్వాములు"గా చూడాలని అన్నారు. అదే నెల చివరలో భారత్‌లోని చైనా రాయబారి జు ఫీహాంగ్ భారత్ సహా ఇతర దేశాలపై అధిక సుంకాలను విధించినందుకు అమెరికాను "బెదిరింపులకు పాల్పడుతోంది" అని వ్యాఖ్యానించారు. ఆగస్టులో, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఏడేళ్ల తర్వాత తొలిసారిగా షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ) రక్షణ సదస్సులో పాల్గొనేందుకు చైనా పర్యటకు వెళ్లారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో కూడా భేటీ అయ్యారు. భారత్ చైనా సంబంధాలను సాధారణ స్థితికి తీసుకురావడంపై ఇద్దరు నేతలు తమ నిబద్ధతలను పునరుద్ఘాటించారు.

ఉద్యోగావకాశం
పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టిస్తున్న
మహా పత్రికకు
(RNI NO: APTEL/2003/09316)
ఏపీ, తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు జిల్లాల వారీగా
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
WWW.EPAPER.MAHAADAILY.COM
ఆసక్తి గల వారు సంప్రదించండి
MAHAAPATRIKA@GMAIL.COM,
95501 59679, 90001 41919

మహా పత్రిక
తెలుగు
శనివారం, హైదరాబాద్
04-10-2025
WWW.MAHAADAILY.COM

Special STORY




# ఎలాన్ మస్క్

## ఈ భూమ్మీద అతనే టాప్

### 500 బిలియన్ డాలర్ల సంపదను దాటి పరుగు

### మస్క్ తొలి ట్రిలియనీర్ అవుతాడంటున్న ఫోర్బ్స్

(మహా ప్రత్యేకం)

ఎలన్ మస్క్. అపర కుబేరుడు. ఎంత కుబేరుడు.. ఈ భూలోకంలో అతనే టాపు.. తోపు. అంతకుమించిన కుబేరుడు ఈ వరల్డ్ లో లేడు. అన్ని రికార్డులు.. అందరి సంపదలను దాటేసి.. తొలి ట్రిలియనీర్ గా చరిత్ర సృష్టించే దిశగా పరుగెడుతున్నాడు. టెస్లా సీఈఓ, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ఈ భూమ్మీద సరికొత్త చరిత్ర సృష్టించాడు. భూమ్మీద అత్యంత సంపద కలిగిన వ్యక్తిగా సగర్వంగా నిలిచాడు,. ఫోర్బ్స్ బిలియనీర్ ఇండెక్స్ ప్రకారం.. ఎలాన్ మస్క్ ఆస్తుల నికర విలువ 500 బిలియన్ డాలర్లు (రూ. 41,07,500 కోట్లు) దాటేసింది. దీంతో అతను తొలి ట్రిలియనీర్ గా చరిత్ర సృష్టించే దిశగా వేగంగా దూసుకెళ్తున్నారు. ఎలాన్ మస్క్‌కు టెస్లా, స్పేస్ ఎక్స్, ఎక్స్, స్టార్ లింక్, న్యూరా లింక్ వంటి సంస్థలు ఉన్నాయి. వాటిలో ఎలక్ట్రిక్ కార్ల సంస్థ టెస్లా ప్రధానమైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఎలాన్ మస్క్ మధ్య ఇటీవల విబేధాలు నెలకొన్నాయి. దీంతో ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో టెస్లా షేర్ల ధరలు భారీగా పడిపోయాయి. కొన్ని రోజుల క్రితం మస్క్ టెస్లాలో ఒక బిలియన్ విలువైన షేర్లను కొనుగోలు చేశారు. అది ముదుపర్ల విశ్వాసాన్ని పెంచింది. దీంతో షేర్లు ధరలు కూడా పెరిగాయి. ఎలాన్ మస్క్ టెస్లా కంపెనీలో సెప్టెంబర్ 15 నాటికి 12.4శాతం వాటా కలిగి ఉన్నాడు.. అయితే, ఈ ఏడాదిలో సంస్థ షేర్లు 14శాతం పెరిగాయి. బుధవారం ఒక్కరోజే 4శాతం పెరిగాయి. దీంతో ఆయన సంపద 9.3 బిలియన్ డాలర్లకు పెరిగింది. అయితే, రానున్న రోజుల్లో మార్కెట్ విలువను భారీగా పెంచేందుకు టెస్లా ప్రయత్నాలను ముమ్మరం చేసింది.

#### రోబో ట్యాక్సీ.. ఏఐ మార్కెట్

రోబో ట్యాక్సీ, ఏఐ మార్కెట్‌ను భారీగా విస్తరించేందుకు లక్ష్యంగా మస్క్ టీమ్ పెట్టుకుంది. మస్క్ ఈ లక్ష్యాలను సాధిస్తే టెస్లా సంస్థ నుంచి ఆయనకు భారీ ప్రోత్సాహక ప్యాకేజీ కింద భారీగా షేర్లు సమకూరనున్నాయి. దాదాపు 900 బిలియన్ డాలర్లు సమకూరనున్నట్లు అంచనా. దీంతో మస్క్ సంపద విలువ ట్రిలియన్ డాలర్లు దాటిపోవచ్చునని అంచనా. ఇంతకుముందు దాదాపు 350.7 బిలియన్ల డాలర్ల నికర విలువతో ఫోర్బ్స్ జాబితాలో మస్క్ తరువాత రెండో అత్యంత ధనవంతుడిగా ఒరాకిల్ వ్యవస్థాపకుడు లారీ ఎల్లిసన్ నిలిచారు. ఇదిలాఉంటే.. మస్క్ సంపద ఇదే వృద్ధి రేటును కొనసాగిస్తే. .2033 మార్చి నాటికి ఆయన ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్ అవుతారని ఫోర్బ్స్ నివేదిక పేర్కొంది.

#### ఎలాన్ మస్క్ నేపథ్యం:

**నిజమైన పేరు:** ఎలాన్ రీవ్ మస్క్
**జననం:** జూన్ 28, 1971
**జాతీయత:** దక్షిణ ఆఫ్రికన్, కెనడియన్, అమెరికన్
**ప్రముఖ సంస్థలు:** టెస్లా (సీఈవో), స్పేస్‌ఎక్స్ (వ్యవస్థాపకుడు), ఎక్స్ (యాజమాన్యం)

#### బాల్యంలో మస్క్ కష్టాలు

ఎలాన్ మస్క్ ప్రపంచంలోనే నెంబర్ వన్ 1 బిలియనీర్. టెస్లా, స్పేస్ ఎక్స్, ట్విట్టర్, న్యూరాలింక్ ఇలా టెక్ మొగల్‌గా ఉన్నారు. ప్రపంచంలో అత్యంత ప్రభావవంతమైన వ్యక్తుల్లో ఒకరిగా ఉన్నారు. అయితే తన బాల్యం అనుకున్నంత సంతోషంగా ఏం లేదని ఎలాన్ మస్క్ వెల్లడించారు. 1989కి ముందు తాను సింగిల్ బెడ్రూం ఫ్లాట్‌లో నివసించేవాడినని వెల్లడించారు. తాను చిన్నతనంలో ఎదుర్కొన్న అనుభవాలను వివిధ సందర్భాలలో చెప్పారు. తన ప్రారంభ సంవత్సరాల్లో 'అస్తిత్వ సంక్షోభం' చుట్టుముట్టడాన్ని వివరించారు. జీవితానికి అర్థం ఏమిటి..? అవన్నీ అర్థరహితం కాదా..? ఎందుకు ఆత్మహత్య చేసుకోకూడదు..? ఎందుకు ఉన్నాను..? అని తరుచుగా తనను తాను ప్రశ్నించుకున్నానని వెల్లడించారు. మస్క్‌కి చెందిన ఆటోబయోగ్రఫీలో అతని చిన్ననాటి పోరాటాలను గురించి చెప్పారు. దక్షిణాఫ్రికాలో మస్క్ ఎదుర్కొన్న సంఘర్షణను ఇందులో వెల్లడించారు. మస్క్ చిన్నప్పుడు పాఠశాలలో వేధింపులకు గురయ్యాడని, ఒక విద్యార్థి మస్క్ తలపై తన్నడంతో మెట్లపై నుంచి పడిపోవడాన్ని ఇందులో ప్రస్తావించారు. దక్షిణాఫ్రికాలో పెరగడంతో మస్క్ నొప్పిని ఎలా ఎదుర్కోవాలనేది నేర్చుకున్నాడంటూ పేర్కొన్నాడు. మస్క్ తండ్రి ఎర్రోల్, తల్లి మాయే వివాహం కూడా సంతోషంగా లేదని, తరుచూ పిల్లల ముందు గొడవ పడేవారని ఐజాక్సన్ పేర్కొన్నారు. 12 ఏళ్ల వయసులో మస్క్ సర్వైవల్ క్యాంప్‌కి వచ్చాడనేది కూడా పుస్తకంలో వివరించారు. ఈ క్యాంపులో ఇతర పిల్లల కన్నా మస్క్ చిన్నవాడని, రెండుసార్లు మస్క్‌ని క్యాంపులో కొట్టారని పుస్తకంలో పేర్కొన్నారు. ఇలా కష్టాలు అనుభవించిన మస్క్ పట్టుదలతో.. ప్రపంచంలోనే అత్యంత కుబేరుడయ్యాడు.







# విజయ దశమి వేడుకల్లో పాల్గొన్న కంది శ్రీనివాస రెడ్డి దంపతులు







**ఆదిలాబాద్ మహా :** చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా విజయ దశమి పండగను జరుపుకుంటామని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు.గురువారం రాత్రి ఆదిలాబాద్ పట్టణంలోని డైట్ మైదానంలో సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జరిగిన దసరా వేడుకులకు ఆయన తన సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజల్వన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జమ్మి చెట్టుకు పూజలు చేసిన అనంతరం జాతిపిత మహాత్మ గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళ్లు అర్పించారు. అనంతరం కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ..అటు రామాయణంలో ఇటు మహాభారతంలోనూ విజయ దశమి పర్వదిన ప్రాశస్త్యాన్ని ఉదాహరణలతో వివరించారు.ఆయన ప్రసంగానికి సభికుల నుండి చప్పట్ల ద్వారా మంచి స్పందన కనిపించింది. హిందూ ధర్మాన్ని చాటి చెప్పేలా మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న సనాతన హిందూ ఉత్సవ సమితి కార్యవర్గాన్ని ఆయన అభినందించారు. సమితి ద్వారా చేపట్టే కార్యక్రమాలకు ఎవరైనా ఆటంకం కలిగించాలని చూస్తే భక్తులే తగిన బుద్ధి చెబుతారని అన్నారు.మంచి కార్యక్రమాలు చేపట్టే సనాతన హిందూ ఉత్సవ సమితికి తన అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు.భవిష్యత్తులోనూ ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహించాలని సమితి కార్యవర్గాన్ని కోరారు. అనంతరం రావణ దహన పూజలో పాల్గొని దశకంఠుని బొమ్మకు నిప్పంటించారు.రావణ దహనాన్ని ఆసక్తి కొద్ది పలువురు తమ మొబైల్స్ లో చిత్రీకరించుకొన్నారు. అంతకుముందు నిర్వహించిన నాగపూర్ ఆర్కెస్ట్రా బృంద కళాకారుల భక్తి పాటలు ,నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో మాజీ మంత్రి జోగురామన్న, ముడుపు మౌనీష్ రెడ్డి సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి , గౌరవ అధ్యక్షులు నర్సగౌడ్,కార్యదర్శి సూర్యకాంత్, మాధవ్ , కోశాధికారి రేణుకుంట రవీందర్ , కార్యనిర్వహక కార్యదర్శి కందుల రవీందర్ , సభ్యులు , సంతోష్, సీను , సంతోష్అగర్వాల్, శ్రీనివాస్ దశరథ్, నర్సింలు, మహిపాల్ , నర్సోజీ , రాజు ,పట్టణం నుండే కాకుండా పరిసర ప్రాంతాల నుండి వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.



# అమ్మవారి సేవలో రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి

- రాష్ట్రంలో శాంతిభద్రలపై ప్రత్యేక దృష్టి
- అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి
- స్వగ్రామంలో దసరా పండుగ సంబరాలలో డిజిపి



**రంగారెడ్డి జిల్లా మహా:** తెలంగాణ రాష్ట్ర డిజిపిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారి తన స్వగ్రామం పెద్దతుండ్లకు విచ్చేసిన బత్తుల శివధర్ రెడ్డికి, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. తెలంగాణ రాష్ట్ర డిజిపిగా నియమితులై బాధ్యతలు స్వీకరించిన తర్వాత, విజయదశమి సందర్భంగా తొలిసారిగా తన స్వగ్రామం, రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం, పెద్దతుండ్లకు కుటుంబ సభ్యులతో కలిసి విచ్చేసిన సందర్భంగా, డిజిపి శివధర్ రెడ్డి దంపతులను, ఘనంగా డప్పులు, డోళ్లు, భజంత్రీలు, బాణాసంచాలతో గ్రామస్తులంతా కలిసి వారిని దసరా ఉత్సవాలకు ఆహ్వానించారు. గ్రామంలో నిర్వహించిన భారీ దసరా ఊరేగింపులో శివధర్ రెడ్డి దంపతులు, కుటుంబీకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జమ్మిపూజ నిర్వహించిన తర్వాత గ్రామంలోని ప్రసిద్ధ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో స్వామివారికి, తదుపరి దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి యొక్క ఆశీస్సులు అందరిపై ఉండాలని, అమ్మవారిని కోరినట్లు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని అమ్మవారి సేవలో పాల్గొనాలని అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పై ప్రత్యేక దృష్టి సారించామని, రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కటుదిటమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని డిజిపి బత్తుల శివధర్ రెడ్డి అన్నారు. అనంతరం ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ కమిటీ మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డిలు, రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ శాఖ ఉన్నతాధికారులు, ఇబ్రహీంపట్నం ఏసిపి కేపీవి రాజు, సీఐ మహేందర్ రెడ్డి, ఎస్సైలు, ఇతర పోలీసు సిబ్బంది, మాజీ ప్రజా ప్రతినిధులు, ఆలయ నిర్వాహకులు ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

## మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



**రాజేంద్రనగర్ మహా;** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. దసరా పండుగ సందర్భంగా మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్ వెంకటేష్ డివిజన్ నాయకులతో కలిసి సబితా ఇంద్రారెడ్డి నివాసంలో శుక్రవారం కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ జరగనున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు లక్ష్యంగా కృషి చేయాలని అన్నారు. అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని సూచించారు. ఏది ఏమైనా అన్ని స్థానాలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులుగా గెలుపొందేందుకు కృషి చేయాలని సబితా రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సుభాష్ రెడ్డి, రమేష్ ముదిరాజ్ , లక్ష్మీ రాజ్ , రాము యాదవ్ , రాజేష్ యాదవ్, గుమ్మడి కుమార్ , ఈర్లపల్లి ప్రవీణ్, రాజు, శ్రీకాంత్ రెడ్డి , రాజ్ కుమార్ , ప్రదీప్ , అశోక్ కుమార్, కార్తీక్ , తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిష్టాత్మకంగా వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం

- ఆలయంలో ప్రత్యేక హోమం కార్యక్రమం
- ముఖ్యఅతిథిగా పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్
- స్థానిక శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి



**రంగారెడ్డి జిల్లా మహా:** ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణంలో భాగంగా, శుక్రవారం ప్రత్యేక హోమం కార్యక్రమానికి పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, స్థానిక శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు. రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మునగనూరు గ్రామంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న వెంకటేశ్వర స్వామి అభిషేక ఆనంద ఆలయం ప్రదాన ద్వారం గర్భాలయం గడప పూజ, హోమం కార్యక్రమానికి, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి ఆహ్వాన మేరకు, ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్రం పిసిసి అధ్యక్షులు, శాసన మండలి సభ్యులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే రంగారెడ్డితో కలిసి హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి, పీసీసీ సభ్యులు మహేష్ కుమార్ గౌడ్, విజయదశమి మరియు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పీసీసీ సభ్యులు మహేష్ కుమార్ గౌడ్ ను కలిసిన, టిఎస్ఆర్టిసి చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి ఆయనకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల ఉపాధ్యక్షులు మల్ రెడ్డి యాదిరెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ బాస్కర చారి, సభ్యులు జైపాల్ రెడ్డి, అంజయ్య పలువురు నాయకులు పాల్గొన్నారు.



# మద్యం మత్తులో ఒకరిపై ఒకరు దాడి

**మందమర్రి, మహా :** విజయదశమి పండగ పర్వదినం సందర్భంగా యువకులు మద్యం మత్తులో ఒకరిపై ఒకరు దాడులు చేసుకొని హల్ చల్ సృష్టించారు. ఎన్నడూ లేని విధంగా మందమర్రి పాల చెట్టు ప్రాంతంలో యువకులు దాడులకు పాల్పడడంతో స్థానిక ప్రజలు ఒక్కసారిగా భయంతో గురయ్యారు. గురువారం రాత్రి మందమర్రి పోలీసు స్టేషన్ రెండు గ్రూపులు రాళ్లు, కర్రలతో కొట్టుకున్నారు. మద్యం మత్తులో ఆటోలో ఉన్న పలువురు యువకులపై విచక్షణా రహితంగా దాడి చేశారు. ఈ విషయాన్ని ఆటో డ్రైవర్ తన స్నేహితులకు ఫోన్ చేసి చెప్పడంతో వారు ఘటనాస్థలానికి వచ్చి ప్రత్యర్థులపై కర్రలు, రాడ్స్ తో ప్రతి దాడి చేశారు. పరస్పర దాడిలో పలువురి బట్టలు చిరిగిపోయాయి. పోలీసులు సింగరేణి పాఠశాల మైదానంలో నిర్వహించిన రావణ దహన కార్యక్రమంలో బందోబస్తులో ఉండగా ఇక్కడ ఇరుపాక్షల దాడి జరగడం పలువురిని భయాందోళనకు గురిచేసింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆటోను, నిందితులు అదుపులోకి తీసుకున్నారు.







# స్వగ్రామంలో కంది శ్రీనివాస రెడ్డి ఫ్యామిలీ దసరా సందడి

**ఆదిలాబాద్ మహా :** హిందూ సంస్కృతీ సాంప్రదాయాలలో అత్యంత ముఖ్యమైన పండగ విజయదశమిని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి సంబరంగా జరుపుకున్నారు. ఆదిలాబాద్ పట్టణంలో వేడుకలకు హాజరైన అనంతరం తన స్వగ్రామం తాంసి మండలం హస్నాపూర్ గ్రామానికి చేరుకున్నారు. ఇంటి వద్ద కంది శ్రీనివాస రెడ్డి తన తల్లి దండ్రులకు శమీ పత్రి ఇచ్చి సతీమణితో కలిసి పాదాభివందనం చేసి ఆశీస్సులు తీసుకున్నారు. గ్రామస్తులు ఆయనను కలిసి పండగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దేవీ మండపం వద్ద గ్రామ మహిళలు , యువతులు, చిన్నారులు, కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ పాటలకు స్టెప్పులేసారు.

# పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా ఆయుధ పూజ



**హన్మకొండ మహా;** విజయదశమి పండుగ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యి ఆయుధ భాండాగారం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దుర్గామాత తో పాటు ఆయుధాల యంటి విభాగంలో ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరం కార్యాలయం ఆవరణలోని శమీ వృక్షానికి పూజలు చేసి అధికారులు, సిబ్బంది కి శమీపత్రాలను అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చివరగా పోలీస్ కమిషనర్ య టి విభాగంలో పోలీస్ కమిషనర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ఈస్ట్ డీసీపీ అంకిత్ కుమార్, క్రైం డీసీపీ గుణ శేఖర్ అదనపు డీసీపీలు,రవి సురేష్ కుమార్,శ్రీనివాస్, ఏ. ఎస్పీ శుభం ప్రకాష్ , ఏసీపీలు నాగయ్య, మధుసూదన్, అనంతయ్య, సురేంద్ర,, ఆర్. ఐలు స్పర్జన్ రాజ్, శ్రీనివాస్, శ్రీధర్, చంద్ర శేఖర్, ఆర్ ఎస్ ఐ లతో తో ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కార్మికుల సొంతింటి కలకు కృషి

## కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేకానంద



**మందమర్రి, మహా :** సింగరేణి కార్మికుల సొంతింటి కల కు కృషి చేస్తానని తెలంగాణ కార్మిక మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేకానంద హామీ ఇచ్చారు. గురువారం సింగరేణి పాఠశాల మైదానంలో స్థానిక జిఎం రాధాకృష్ణ నిర్వహించిన దసరా, రావణ వధ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న సొంతింటి కల సహకారానికి తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సింగరేణి సంస్థలో 30 సంవత్సరాల నుండి 40 సంవత్సరాలు విధులు నిర్వహించి పదవి విరమణ పొందే నాటికి కూడా సొంత గృహాన్ని నిర్మించుకోలేక పోతున్నారని అన్నారు. సింగరేణి కంపెనీ స్థలాలలో కార్మికులకు సొంతగృహం నిర్మించుకునేలా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడుతానని తెలిపారు. ఈ ప్రాంతంలో ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న శ్రావణ్ పల్లి బొగ్గు గని ప్రారంభించేందుకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తో మాట్లాడినట్లు వెల్లడించారు. రానున్న కొద్ది రోజుల్లో కేంద్ర ప్రభుత్వం నిర్వహించే వేలం పాటలో సింగరేణి సంస్థ పాల్గొని గనిని దక్కించుకుంటామని భరోసా పలికారు. గతంలో కేంద్రం మంత్రి స్వర్గీయ కాక గడ్డం వెంకటస్వామి సింగరేణి సంస్థ నష్టాలలో ఉండి బి ఐ ఎఫ్ ఆర్ లోకి వెళ్లే క్రమంలో నాలుగు వందల కోట్ల రూపాయలు ఇప్పించారని తెలిపారు. తన కుమారుడు పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ రిటైర్డ్ సింగరేణి కార్మికులకు 120 కోట్ల రూపాయలు ఇప్పించారని వెల్లడించారు. తమ కుటుంబమంతా కార్మికుల పక్షపాతిగా వ్యవహరిస్తుందని చెప్పారు. ప్రశాంత వాతావరణంలో ప్రజలు దసరా పండగ పర్వదినాన్ని భార్యాపిల్లలు, బిడ్డలు, కొడుకులు, కోడళ్ళతో ఆనందంగా జరుపుకోవాలని కోరారు. అనంతరం మందమరి జిఎం రాధాకృష్ణ మాట్లాడుతూ సింగరేణియులను ఒకటి చేసేందుకు ఈ మైదానంలో రావణ వద కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సింగరేణి కార్మికులు ఉత్పత్తి ఉత్పాదకత ఏరియా లక్ష్యాలను సాధించే దిశగా విధులు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగరేణి గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ) నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, సలేంద్ర సత్యనారాయణ, పీఎం శ్యాంసుందర్ తదితరులు ఉన్నారు. అంతకుముందు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట పాటలు పలువురుని అలరించాయి. అనంతరం రావణ వాద కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. మైదానంలో పలువురు సింగరేణియులు ఒకరికొకరు పండగ శుభాకాంక్షలు తెలిపి అలాయి, బలాయి తీసుకొని ఆనందాన్ని పంచుకున్నారు.

# పీజీ సీట్లు పొందిన విద్యార్థులు 8వ తేదీలోపు సెల్ఫ్ రిపోర్టు చేయాలి

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి ప్రభుత్వ పీజీ కళాశాలలో ఎంఏ పొలిటికల్ సైన్స్, ఎంఏ ఇంగ్లీష్, ఎంకామ్ పీజీ కోర్సులలో సిపి గెట్ ద్వారా మొదటి విడతలో సీటు పొందిన అభ్యర్థులు ఈనెల 8వ తేదీలోపు కళాశాలలో సెల్ఫ్ రిపోర్ట్ చేయాలని ప్రిన్సిపాల్ డా.కాంపల్లి శంకర్ తెలిపారు. సీటు పొందిన అభ్యర్థులు ఒరిజినల్ టి సి మరియు ఇతర విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్, సెల్ఫ్ రిపోర్టింగ్ ఫీజు ఆన్లైన్లో చెల్లించి అక్నాలెడ్జ్మెంట్ కళాశాలలో అందజేయాలని సూచించారు.

# నగరంలో ఘనంగా బస్తీ ఉత్సవ్ కార్యక్రమం

## నిత్యం దేశ సేవలో శ్రమిస్తున్న సంఘ్ పరివార్



**వరంగల్ మహా;** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాధాకృష్ణ (మహేశ్వరీ) గార్డెన్స్ లో బస్తీ ఉత్సవ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బోయిడి ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభోపన్యాసం చేశారు. తదనంతరం వక్త గా విచ్చేసిన ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత కార్యవాహ్ రమేష్ మాట్లాడుతూ సంఘ్ ఏర్పాటు ఎలాంటి పరిస్థితిల్లో జరిగిందో వివరంగా తెలుపుతూ కేవలం కొంత మంది పిల్లలతో నాగపూర్ లో ప్రారంభమయి ఈ శాఖ నేడు ప్రపంచ వ్యాప్తంగా ఎలా విస్తరించిందో క్షుణ్ణంగా తెలిపారు. వ్యక్తి నిర్మాణమే ధ్యేయంగా, దేశాన్ని శ్రేష్ఠ స్థానంలో నిలబెట్టడమే లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ నేటి వరకు పనిచేస్తుందని మూడు సార్లు నిషేధం విధించిన అప్పటికి ఎలాంటి తప్పు చెయ్యని సంఘ్, దేశ సేవలో నిత్యం శ్రమిస్తూనే వచ్చిందని అంతేకాకుండా ఆర్ఎస్ఎస్ యుద్ధాల సమయంలో, ప్రకృతి విపత్తులో, కరోనా సమయంలోనూ ఏ విధంగా దేశ పౌరులకు సేవలు చేసిందో పూర్తిగా వివరించారు. ముఖ్యంగా కార్మిక, కర్షక,విద్య, ఆధ్యాత్మిక, పౌర ఇలా సుమారు 50 రంగాలలో ఎందరో కార్యకర్తల్ని తయారు చేసింది. ఈ వంద సంవత్సరాలను కేవలం ఉత్సవం గా జరుపుకోకుండా పంచ్ పరివర్త అను ఐదు ముఖ్య సిద్ధాంతాలను కర్తవ్యంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పౌర నియమాలను పాటించుట, రాజ్యాంగాన్ని ఆచరించుట, పర్యావరణ హితమైన పద్ధతులు పాటించుట, కుటుంబ విలువలను పెంపొందించుట, ప్రతి స్వయంసేవక్ ఒక చెట్టునైనా నాటాలని, స్వదేశీ వస్తువులను ఐదు ఉపయోగించి భారత ఆర్థిక వ్యవస్థను మెరుగు పర్చాలని, సామాజిక సామరస్యాన్ని పాటించాలని పిలుపునిచ్చారు.

# అంగరంగ వైభవంగా విజయదశమి వేడుకలు

## రంగలీల మైదానంలో 70 అడుగుల రావణ ప్రతిమ దహనం



**వరంగల్ మహా;** వరంగల్ నగరంలోని ఉర్సు రంగాలీలా మైదానంలో గురువారం సాయంత్రం నిర్వహించిన దసరా సంబరాలు అంబరాన్నంటాయి. ఈ వేడుకల్లో ముఖ్య అతిథులుగా హాజరైన శాసనమండలి ఉపాసభాపతి బండ ప్రకాష్, నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, జిడబ్ల్యూఎంసి కమిషనర్ చాహాత్ బాజ్ పాయి, డిసిపి సలిమా లతో కలసి మంత్రి కొండా సురేఖ ఆటోమెటిక్ స్విచ్ ఆన్ చేసి , రావణ వధ, దసరా వేడుకలను ప్రారంభించారు. దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షులు నాగపురి సంజయ్ బాబు, జనరల్ సెక్రెటరీ మేడిది మధుసూదన్, ట్రస్ట్ చైర్మన్ కోటేశ్వర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పది తలలతో కూడిన 70 అడుగుల రావణ ప్రతిమ దహన ఘట్టం కనుల పండుగగా జరిగింది. మిరుమిట్ల గొలుపే వెలుగుల్లో బాణసంచా పేలుళ్లతో ప్రాంగణమంతా దద్దరిల్లింది. అంతకుముందు కరీంబాద్ రామస్వామి గుడి నుండి సీతారామాంజనేయ, లక్ష్మణుడి విగ్రహాలను రథంపై ప్రతిష్ఠించి వేలాది మంది వెంటరాగా, కోలాటం, డప్పు చప్పుళ్ళు, వాయిద్యాలు భజనలు నృత్యాల నడుమ రంగలీల మైదానికి చేరుకున్నారు. అనంతరం షమీ పూజ, పాలపిట్ట దర్శనం నిర్వహించారు. ఈ వేడుకల్లో పేరిణి శివతాండవం, కూచిపూడి నృత్యాలు విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, రాణిరుద్రమ్మ, జానపద గేయాలు తెలంగాణ ఆటపాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. యువతి యువకులు కేరింతలు కొడుతూ సంబరాల్లో మునిగితేలారు. చెడుపై విజయం సాధించిన రోజునే ప్రజలు విజయదశమిగా జరుపుకోవాలని ఆనవాయితీగా వస్తోందని మంత్రి కొండా సురేఖ అన్నారు. వేడుకలకు ప్రారంభించిన మంత్రి దసరా విశిష్టతను గురించి కులంకశంగా వివరించారు. రంగలీలా మైదానంలో భక్తుల సౌకర్యార్థం జిల్లా యంత్రాంగం, గ్రేటర్ మునిసిపల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయడంపై మంత్రి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మంత్రి, నగర మేయర్ తో కలసి రంగశాయిపేట, 22వ డివిజన్ లోని కొత్తవాడ తోట మైదానంలో సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన రావణ ప్రతిమ దహనం దసరా వేడుకల్లో మంత్రి పాల్గొని ప్రారంభించారు. అంతకుముందు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు బస్వరాజు కుమార్, ఆడేపు స్వప్న, మరుపల్ల రవి, పోశాల పద్మ, ముష్కమల్ల అరుణ, జలగం అనిత, మాజీ కార్పొరేటర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, జిడబ్ల్యూఎంసీ, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ జయంతి వేళ జంతుబలి కలకలం

## సీఐ సమక్షంలోనే జంతు బలి పై సర్వత్రా విమర్శలు



**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా నర్సంపేటలో గాంధీ జయంతి రోజే దసరా పండుగ కావడం అందులో సీఐ సమక్షంలోనే బహిరంగంగా గొర్రెలను బలివ్వడం వివాదాస్పదంగా మారింది. కాగా ప్రభుత్వ ఆదేశాలతో పాటు అహింస పాటించాల్సిన గాంధీ జయంతి రోజున నర్సంపేట సీఐ రఘుపతిరెడ్డి సమక్షంలోనే ఈ కార్యక్రమం జరగడం పలు విమర్శలకు దారితీసింది. యానిమల్స్ యాక్ట్1960 ప్రకారం ప్రజా ప్రదేశాల్లో అనుమతి లేకుండా జంతుబలి నేరం అని ప్రజా సంఘాల నేతలు అంటున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యుల పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. నర్సంపేట ఘటనపై విచారణ కొనసాగుతోంది.

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

వరంగల్ జిల్లా నర్సంపేటలో గాంధీ జయంతి వేళ సీఐ సమక్షంలో నిర్వహించిన జంతు బలి ఘటన పై వరంగల్ పోలీస్ కమిషనర్ స్పందించారు. ఈ ఘటన పై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ తెలిపారు. కాగా గురువారం సాయంత్రం వెంకటేశ్వరస్వామి గుడి దగ్గర ఈ కార్యక్రమం జరిగిందని అక్కడికి పోలీసులు బందోబస్తు కోసం వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగిందని తెలుస్తోంది.

# అంబరాన్నంటిన దసరా సంబరాలు



దుర్గామాత విగ్రహాల ఊరేగింపు

**ఆమనగల్లు, మహా :** ఆమనగల్లు ప్రాంతంలో గురువారం దసరా పండుగ వేడుకలు అంబరాన్నంటాయి. ప్రజలు రెట్టింపు ఉత్సాహంతో దసరాను ప్రతి పల్లె లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రేయంత విందు వినోదాలతో సంబరాలు చేసుకున్న ప్రజలు సాయంత్రం నూతన వస్త్రాలు ధరించి భక్తి గీతాలు ఆలపిస్తూ, భజనలు చేస్తూ జమ్మి చెట్టు వరకు ఊరేగింపుగా వెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల ప్ర జలు శమీ వృక్షానికి, ఆయుధాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జమ్మి పత్రిని ఒకరినొకరు ఇచ్చి పుచ్చుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ఆలయాల్లో పూజలు చేశారు. పండుగను పురస్కరించుకొని ఆమనగల్లు పట్టణంలో రావణ దహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పట్టణప్రజలు భారీగా తరలివచ్చి దహన కార్యక్రమాన్ని తిలకించారు. కార్యక్రమంలో జాతీయ ఓబీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, మాజీ ప్రజా ప్రతినిధులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. వివిధ పట్టణ, గ్రామాల్లో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాల ఊరేగింపు గురువారం కనుల పండుగగా కొనసాగింది. అంతకుముందు దుర్గామాత విగ్రహాలకు నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించి మహిళల కోలాటాలు, భజనలు, యువత ఆనందోత్సవాల మధ్య టపాసుల మోతతో ఊరేగింపుగా చెరువుకు తరలించారు. అనంతరం దుర్గామాత విగ్రహాలకు పూజలు నిర్వహించి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆయా ఉత్సవ సమితి సభ్యులు, భక్తులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

# తల్లి... దీవించు

## పూజల్లో పాల్గొన్న భక్తులు... మైసిగండిలో పోటెత్తిన భక్తజనం



**ఆమనగల్లు, మహా :** ఆపద మొక్కుల అమ్మగా, పేదల ఇలవేల్పుగా రాష్ట్ర స్థాయిలో ప్రసిద్ధి చెందిన కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ దేవాలయంలో దసరా పండుగ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.. అమ్మవారిని పట్టువస్త్రాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల మైసమ్మ నామస్మరణతో మైసిగండి ఆలయం మార్మోగింది. ఆలయంలోని పుట్ట వద్ద మహిళలు పూజలు నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు మైసమ్మ దేవతను దర్శించుకొని పూజలు చేశారు.ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ రామావత్‌సిరోలిపంతూ, ఈవో స్నేహలత, టీపీసీసీ సభ్యుడు అయిల్ల శ్రీనివాస్ గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

**మైసిగండి ఆలయానికి పోటెత్తిన భక్తజనం**

మైసిగండి మైసమ్మ దేవతను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. దసరా పండుగ సందర్భంగా అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ యేడు సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు భాగా పండాలని, వ్యాపారాలు అభివృద్ధి సాధించాలని కోరుతూ అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తమ వాహనాలకు పూజలు చేయించుకున్నారు.ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

# అలాయ్ బలాయ్‌లో వరంగల్ జిల్లా అధ్యక్షులు

- బండారు దత్తన్న అంటేనే అందరికీ ఆత్మబంధువు
- బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్



**వరంగల్ మహా;** అనేక మంది నాయకులకు, కార్యకర్తలకు స్ఫూర్తి ప్రదాత, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అలయ్ బలయ్ కార్యక్రమం హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో ఘనంగా నిర్వహించగా ఈ కార్యక్రమంలో అన్ని పార్టీల ముఖ్య నేతలతో పాటు బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంట రవి కుమార్ మాట్లాడుతూ దత్తాత్రేయ అనగానే రెండు పండుగలు గుర్తొస్తాయి. ఒకటి హోలీ, రెండోది అలయ్ బలయ్. హోలీ పండుగను దత్తాత్రేయ గారు చాలా గొప్పగా నిర్వహిస్తారు. ఢిల్లీకి రాజైనా తల్లికి బిడ్డే అన్నట్లు కేంద్రమంత్రి అయినా, గవర్నర్ అయినా, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను రాబోయే తరాలకు అందించాలనే ఉద్దేశంతో గత 20 సంవత్సరాలుగా దత్తాత్రేయ అలయ్ బలయ్ నిర్వహిస్తున్నారని మనుషుల మధ్య స్నేహం పెరగడానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ఈ సంస్కృతి రాబోయే తరాలకు దత్తాత్రేయ స్ఫూర్తి చూపిన బాటలో అందరూ నడవాలని పిలుపునిచ్చారు.

# మైసిగండి మైసమ్మ తల్లికి క్షీరాభిషేకం

## పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఎఐసిసి సభ్యులు చల్లా వంశీ చంద్ రెడ్డి



**ఆమనగల్లు, మహా :** జిల్లాలోనే ప్రసద్ధిగాంచిన మైసిగండి మైసమ్మ తల్లి ఆలయంలో విజయదశమి పండుగ సందర్భంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరా పండుగను పురస్కరించుకొని ప్రతి సంవత్సరం మైసిగండి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, పిసిసి సభ్యులు ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్ కుటుంబ సభ్యులు అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహిస్తారు. శ్రీనివాస్ గౌడ్ అమ్మవారికి నూతనవస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమానికి ఎఐసిసి చల్లా వంశీ చంద్ రెడ్డి, అశ్లేష రెడ్డి దంపతులు హాజరై అమ్మవారికి అభిషేకం, పుష్పాలంకరణ, అర్చనలు, హారతి, ప్రత్యేక పూజకార్యక్రమాలు నిర్వహించారు. పండుగ సందర్భంగా అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే వాహనాలకు పూజలు జరిపించారు.

# ఘనంగా దసరా ఉత్సవాలు..



మొయినాబాద్ మహా: మొయినాబాద్ మున్సిపాలిటీలో దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. హిమాయత్ నగర్ గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాతకు గత తొమ్మిది రోజులుగా ప్రత్యేక పూజలు, భజన సంకీర్తనలతో ఘనంగా ఉత్సవాలు కొనసాగాయి. అనంతరం తొమ్మిది రోజులు పూజలు అందుకున్న అమ్మవారు బుధవారం గంగమ్మ ఒడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా హిమాయత్ నగర్ గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ ముదిగొండ మంజుల రవి యాదవ్ మాట్లాడుతూ గ్రామంలో మొదటిసారి అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఎంతో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించడం జరిగిందని చెప్పారు. అమ్మవారిని మొదటిసారి ఏర్పాటు చేసినా అందరి సహకారంతో ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నామని చెప్పారు. అందరం ఐక్యంగా ఉండి గ్రామంలో ప్రతి పండుగను ఎంతో ఘనంగా నిర్వహించుకుందామని పేర్కొన్నారు. గ్రామంలో జరిగే ప్రతి పండుగను అందరం కుల మతాలకు అతీతంగా నిర్వహించుకొని సామరస్య పూర్వకంగా ఉందామన్నారు. మహిళా ఆడపడుచులు బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొనడం శుభ పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముదిగొండ అనిత శ్రీహరి యాదవ్, మాజీ ఉపసర్పంచ్ షాబాద్ శ్యామ్ రావు, పల్లగొల్ల అశోక్ యాదవ్, మాజీ వార్డు సభ్యులు, ఆయా యువజన సంఘాల అధ్యక్షులు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి విగ్రహంతో పాటు బతుకమ్మలను గండిపేట చెరువులో నిమజ్జనం చేశారు.

# దసరా వేడుకల్లో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే, మాజీ ప్రజా ప్రతినిధులు



**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ నగరంలోని 22వ డివిజన్ తోట మైదానం లో దసరా ఉత్సవ కమిటీ వైభవంగా రావణ వధ కార్యక్రమం ఏర్పాటు చేసారు. అలాగే 14వ డివిజన్ పరిధిలో దసరా ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన రావణ వధ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, తో కలిసి ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ విజయదశమి పర్వదినం ధర్మం అధర్మంపై, సత్యం అసత్యంపై సాధించిన మహా విజయమని ఈ పండుగ మనందరికీ నూతన స్ఫూర్తి, నూతన ఆత్మ విశ్వాసం కలిగిస్తుంది. విజయదశమి సందేశం నేటి సమాజానికి అత్యంత ప్రాసంగికమని మన ధైర్యం, నిజాయితీ, సేవా భావంతో ముందుకు సాగితే ఎలాంటి అడ్డంకులనైనా అధిగమించగలని ప్రజాసేవలో కూడా ఇదే తత్వం పాటిస్తే నిజమైన విజయాన్ని సాధించవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో దసరా కమిటీల సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాల్లు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎస్సై శ్రీకాంత్ సస్పెన్షన్ వేటు

**వరంగల్ మహా;** వరంగల్ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ లో సబ్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్ పై సస్పెన్షన్ వేటు పడింది. విధి నిర్వహణ లో మద్యం సేవించి వరంగల్ లోని రెడ్ బకెట్ బిర్యానీ సెంటర్ ను నడుపుతున్న మాదిగ సామాజి వర్గానికి చెందిన నంద్రు మరియమ్మ, అలాగే ఆమె కుమారుడు శేఖర్ పైన చేయి చేసుకొని అసభ్యంగా ప్రవర్తించి కులం పేరుతో దూషించిన మీల్స్ కాలనీ ఎస్సై శ్రీకాంత్ ను శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సస్పెండ్ చేశారు.



# మహాత్మా గాంధీ అడుగు జాడల్లో నడవాలి

**ఆమనగల్లు, మహా :** జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి,జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ అడుగు జాడల్లో నడవాలని సూచించారు .దేశ స్వాతంత్ర ఉద్యమంలో గాంధీజీ సేవలను గుర్తు చేసుకున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

## మాజీ హోం మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**మొయినాబాద్ మహా న్యూస్:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక బీఆర్ఎస్ కార్యకర్త నాయకులు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర మాజీ హోంమంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. దసరా పండుగను పురస్కరించుకొని మొయినాబాద్ మండల బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి నాయకులతో కలిసి సబితా ఇంద్రారెడ్డి నివాసంలో శుక్రవారం మొయినాబాద్ బీఆర్ఎస్ మండల నాయకులతో ఆయన కలిసి సబితా ఇంద్రారెడ్డి రెడ్డిని దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జరగనున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు లక్ష్యంగా కృషి చేయాలని అన్నారు. అందరితో కలిసి పనిచేయాలని సూచించారు. ఏది ఏమైనా అన్ని స్థానాలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులుగా గెలుపొందేందుకు కృషి చేయాలని సబితా రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ భద్రకాళి భద్రేశ్వరుల కళ్యాణం

## వేలల్లో తరలి వచ్చిన భక్తులు.. ముగిసిన దేవీశరన్నవరాత్రోత్సవాలు



**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధి గాంచిన శ్రీ భద్రకాళి ఆలయంలో అత్యంత వైభవంగా నిర్వహించిన దేవి శరన్నవరాత్రులు విజయ దశమితో ముగిసాయి. ఉదయం నిత్యాహ్నికం నిర్వర్తించి కలశోద్వాసన అమ్మవారికి సామ్రాజ్య పట్టాభిషేకం జరిపిన పిమ్మట చక్ర తీర్థోత్సవం (చక్ర స్నానం), ధ్వజావరోహణం జరిపించారు. దాదాపు ఎనభై వేల మంది విజయ దశమి రోజున అమ్మవారిని దర్శించుకున్నారు. శమీ వృక్షానికి పూజ చేసి శమీ పత్రాలను (జమ్మి ఆకులను) భక్తులు పరస్పరం పంచుకున్నారు. అమ్మవారిని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బందా ప్రకాష్, తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు.

**వైభవంగా భద్రకాళి భద్రేశ్వరుల కళ్యాణ మహోత్సవం**

శ్రీ భద్రకాళి ఆలయంలో శుక్రవారం మధ్యాహ్నం అమ్మవారికి శతఘటాభిషేకం నిర్వహించారు. తదుపరి సాయంకాలం 7 గంటలకు దేవాలయ ప్రాంగణంలో అందంగా ఏర్పాటు చేసిన కళ్యాణ మండపంలో ' శ్రీ భద్రకాళి భద్రేశ్వరుల కళ్యాణం ఆద్యంతం భక్తులను ఒక దివ్యానుభూతికి గురిచేసింది. కళ్యాణం అనంతరం భగవత్ప్రసాదంగా భక్తులకు రుచికరమైన భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో పూర్ణచందర్, తొగరు క్రాంతి, బింగి సతీష్, మోత్కూరి మయూరి, గాండ్ల స్రవంతి, నార్ల సుగుణ, పాలడుగుల ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, జారతి అనంతుల మూగ శ్రీనివాసరావు, ఎక్స్ అఫీషియో మెంబర్ పార్నంది నరసింహా మూర్తి, కార్యనిర్వహణాధికారి రామల సునీత తదితరులు పాల్గొన్నారు.

**అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే నాయిని**

విజయదశమి సందర్భంగా పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, సతీమణి నీలిమ రెడ్డి, కుమార్తె, అల్లుడు డాక్టర్ నాయిని వేయిస్తంభాల ఆలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయిని నియోజకవర్గ ప్రజలంతా ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో నిండు నూరేళ్ళు వర్ధిల్లెలా దీవించాలని ఆ అమ్మవార్లను కోరుకున్నారు. మొదట భద్రకాళీ అమ్మవారిని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డితో పాటు వరంగల్ పార్లమెంటు సభ్యులు డాక్టర్ కడియం కావ్య అమ్మవారిని దర్శించుకున్నారు.

# అధర్మంపై ధర్మం సాధించిన విజయమే

## చెడుపై మంచి సాధించిన విజయం విజయదశమి... కార్పొరేటర్ తోకల



**రాజేంద్రనగర్, మహా ;** మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని పల్లెచెరువు కట్ట మైసమ్మ ఆలయ ప్రాంగణంలో విజయ దశమి సందర్భంగా ఉమ్మడి దేవాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం రావణ దహనం నిర్వహించారు. జమ్మి చెట్టుపూజ కార్యక్రమంలో రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు పై మంచి, అధర్మం పై ధర్మం సాధించిన విజయమే విజయ దశమి అన్నారు. నియోజకవర్గ ప్రజలందరికీ దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పాల పిట్టను చూడడం శుభసూచకం అన్నారు. ఈ విజయ దశమి నాడు ప్రజలు చేపట్టే పనుల్లో సకల విజయాలు.. ఆయురారోగ్యాలతో పాటు, అష్టైశ్వర్యాలు చేకూరాలన్నారు ఈ కార్యక్రమంలో డివిజన్ లోని బిజెపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## నాలుగు నిమిషాల మీటింగ్..
# ఉద్యోగం నుంచి తీసేశారు!



కార్పొరేట్ ఉద్యోగాలు నీటిమీద బుడగలాగా మారిపోయాయి. ఎప్పుడు జాబ్ పోతుందో ఎవరూ ఊహించలేకపోతున్నారు. దీనికి కారణం కొన్ని కంపెనీల ప్రవర్తనే. ఇటీవల ఒక కంపెనీ నాలుగు నిముషాల మీటింగ్ తరువాత.. లేఆఫ్స్ అంటూ షాక్ ఇచ్చింది. దీనికి సంబంధించిన రెడ్డిట్ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అమెరికాకు చెందిన ఒక కంపెనీలో.. రిమోట్‌గా పనిచేస్తున్న ఒక భారతీయ ఉద్యోగి రెడ్డిట్‌లో తనకు ఎదురైన ఆకస్మిక & షాకింగ్ లేఆఫ్ అనుభవాన్ని పంచుకున్నారు. ఇది ప్రస్తుతం నెట్టింట్లో వైరల్‌గా మారింది. నేను ఉదయం 9 గంటలకు లాగిన్ అయ్యాను. 11 గంటలకు కంపెనీ సీఓఓ భారతదేశానికి చెందిన ఉద్యోగులతో మీటింగ్ స్టార్ట్ చేశారు. ఈ మీటింగ్ కేవలం నాలుగు నిమిషాలు మాత్రమే సాగింది. నాలుగు నిమిషాల మీటింగ్‌లోనే.. ఉద్యోగులను తొలగిస్తున్నట్లు, మీటింగ్ పూర్తైన తరువాత మెయిల్స్ అందుతాయని చెప్పాడు. తొలగింపులు పనితీరుకు సంబంధించినవి కాదని, అంతర్గత పునర్నిర్మాణ ప్రక్రియలో భాగమని ఆయన పేర్కొన్నారు. ఇది విన్న నేను ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాను. ఉద్యోగులను ఎక్కువగా దిగ్భ్రాంతికి గురి చేసిన విషయం ఏమిటంటే.. ముందస్తు సరైన సమాచారం లేకుండా ఉద్యోగులను తొలగించడం. అక్టోబర్ నెల పూర్తి జీతం నెలాఖరులోగా చెల్లిస్తామని, పెండింగ్‌లో ఉన్న సెలవులను నగదుగా మారుస్తామని కంపెనీ హామీ ఇచ్చిందని ఉద్యోగి పేర్కొన్నారు. నేను ఉద్యోగం కోల్పోవడం ఇదే మొదటిసారి, ఇది నిజంగా బాధాకరం వెల్లడించారు.

# సిట్రోయెన్ కొత్త కారు: ధర ఎంతంటే?



కొత్త డీప్ ఫారెస్ట్ గ్రీన్ రంగులో కనిపించే ఈ కొత్త సిట్రోయెన్ ఎయిర్‌క్రాస్ ఎక్స్.. ఎంట్రీ & పుష్ స్టార్ట్ బటన్, క్రూయిజ్ కంట్రోల్, స్పీడ్ లిమిటర్, ఆటో ఐఆర్వీఎం, ఎల్ఈడీ ప్రొజెక్టర్ ఫాగ్ లాంప్స్, వెంటిలేటెడ్ సీట్లు, 360డిగ్రీ కెమెరా వంటి వాటితో పాటు 10.25 ఇంచెస్ ఇన్ఫోటైన్‌మెంట్ డిస్‌ప్లే, 7 ఇంచెస్ డిజిటల్ ఇన్స్ట్రుమెంట్ క్లస్టర్ కూడా పొందుతుంది. లేటెస్ట్ డిజైన్, ఫీచర్స్ కలిగిన ఈ ఫ్రెంచ్ బ్రాండ్ కారు.. సేఫ్టీలో 5 స్టార్ రేటింగ్ సాధించింది. కాబట్టి ఇందులో ఆరు ఎయిర్‌బ్యాగులు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, హిల్ హోల్డ్ అసిస్ట్, ఏబీఎస్ విత్ ఈబీడీ, రియర్ పార్కింగ్ సెన్సార్లు మొదలైన సేఫ్టీ ఫీచర్స్ ఈ కారులో ఉన్నాయి. ఇంజిన్ విషయానికి వస్తే.. కొత్త సిట్రోయెన్ ఎయిర్‌క్రాస్ ఎక్స్ 1.2 లీటర్ నేచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోల్ & 1.2లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్ ఆప్షన్స్ ఉన్నాయి. మొదటి ఇంజిన్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ ఎంపికను మాత్రమే పొందుతుంది. రెండోది మాన్యువల్ ట్రాన్స్‌మిషన్‌తో పాటు ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌ను పొందుతుంది.

# లాభాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు



శుక్రవారం ఉదయం నష్టాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి లాభాలను చవిచూశాయి. సెన్సెక్స్ 223.86పాయింట్లు లేదా 0.28 శాతం లాభంతో 81,207.17 వద్ద, నిఫ్టీ 57.95 పాయింట్లు లేదా 0.23 శాతం లాభంతో 24,894.25 వద్ద నిలిచాయి. ఓరియంట్ టెక్నాలజీస్, కేఐఓసిఎల్, ఏఏఏ టెక్నాలజీస్, అట్లాంటా, ఒరిస్సా మినరల్స్ డెవలప్‌మెంట్ కంపెనీ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో నిలిచాయి. సెంటమ్ ఎలక్ట్రానిక్స్, సిగ్మా సాల్వ్ లిమిటెడ్, బజార్ స్టైల్ రిటైల్, టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్, యూరోటెక్స్ ఇండస్ట్రీస్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ కంపెనీలు నష్టాల జాబితాలో నిలిచాయి.

# టూరిస్టు వీసాపై సౌదీ వెళ్తున్నారా?



ముస్లింలు పవిత్రంగా భావించే మక్కా యాత్రలో ఉమ్రాహ్‌కు ప్రత్యేకత ఉంది. రంజాన్ పర్వదినం తర్వాత హజ్ యాత్ర నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో తబాబ్, అరాఫత్ పర్వత సందర్శన.. సైతానుపై రాళ్లను విసరడం.. అక్కడే ఒక నిద్ర చేయడం వంటి క్రతువులు ఉంటాయి. హజ్ సీజన్‌లో కాకుండా.. మక్కా యాత్ర చేయడాన్ని ఉమ్రాహ్ అంటారు. ఇప్పుడు ఉమ్రాహ్ విషయంలో సౌదీ సర్కారు కొత్త నిబంధనలను ప్రకటించింది. టూరిస్టు వీసాపై వచ్చేవారికి ఉమ్రాహ్‌కు అవకాశం ఉండదని తేల్చిచెప్పింది.

**ఏమిటీ ఉమ్రాహ్**

హజ్‌లో మాదిరిగానే ఉమ్రాహ్‌లోనూ క్రతువులుంటాయి. అయితే.. అరాఫత్ సందర్శన, సైతానుపై రాళ్లు వేయడం ఉండదు. ఉమ్రాహ్‌కు వెళ్లేవారు దోవతి, ఉత్తరీయం మాదిరి తెలుపురంగు దుస్తులను ధరించాలి. దీన్ని దీక్షగా భావిస్తారు. నిజానికి మక్కాకు 30కిలోమీటర్ల దూరంలోనే ఈ రీతిలో వస్త్రధారణ చేసి.. యాత్రను ప్రారంభించాలి. భారతీయులు మాత్రం విమానాశ్రయంలోనే ఈ దుస్తులను ధరిస్తారు. మక్కాలోని కాబా చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేశాక.. బయటకు వచ్చి, శిరోముండనం చేయించుకుంటే.. ఉమ్రాహ్ పూర్తవుతుంది. మహిళా భక్తులు శిరోముండనం చేయించుకోరు. కానీ, మూడు లేదా ఐదు కత్తెరలు ఇస్తారు. ఉమ్రాహ్ ప్రయాణాన్ని ప్లాన్ చేయడానికి విదేశాల నుంచి వెళ్లేవారు తెలుసుకోవాల్సిన 10 ముఖ్యమైన మార్పులను అసా టూర్స్ అండ్ ట్రావెల్స్ ఓనర్ కైసర్ మహమూద్ తెలిపారు.

**వీసా దరఖాస్తు చేసేటప్పుడే వసతి బుకింగ్**

యాత్రికులు ఇకపై వసతిని ధ్రువీకరించకుండా ఉమ్రాహ్ వీసా కోసం దరఖాస్తు చేసుకోలేరు. నుసుక్ యాప్‌కు అనుసంధానించబడిన మసర్ వ్యవస్థ ద్వారా ప్రయాణికులు వీసా దరఖాస్తు సమయంలో ఆమోదించిన హోటల్‌ను ఎంచుకోవాలి. లేదా వారు సౌదీ అరేబియాలోని బంధువులతో ఉంటారని ధ్రువీకరించుకోవాలి. హోటళ్లు, రవాణా మసర్ అని పిలువబడే సౌదీ వ్యవస్థతో అనుసంధానించబడి ఉంటుంది. టాక్సీలను కూడా పోర్టల్ ద్వారానే బుక్ చేసుకోవాలి.

**బంధువులతో ఉండటానికి హోస్ట్ ఐడీ అవసరం**

ప్రయాణికులు స్నేహితులు, కుటుంబ సభ్యులతో ఉండాలని ప్లాన్ చేస్తే హోస్ట్ ఏకీకృత సౌదీ ఐడీ నంబర్‌ను అందించాలి. ఈ ఐడీ మీ వీసాకు డిజిటల్‌కు అటాచ్ చేస్తారు. ప్లాన్‌లో ఏదైనా మార్పు ఉంటే వసతి రుజువుగా అదే ఐడీతో సిస్టమ్‌లో అప్ డేట్ చేయాలి.

**టూరిస్ట్ వీసాలపై ఉమ్రాహ్ చేయకూడదు..**

టూరిస్ట్ వీసాపై ఉమ్రాహ్ చేయడం నిషేధించారు. ఒకవేళ ఇందుకోసం ప్రయత్నించే యాత్రికులను మదీనాలోని రియాజ్ ఉల్ జన్నా వంటి కీలక ప్రదేశాల్లో ప్రవేశం నిరాకరిస్తారు.

**డెడికేటెడ్ ఉమ్రాహ్ వీసా తప్పనిసరి**

నుసక్ ప్లాట్‌ఫామ్ ద్వారా లేదా లైసెన్స్ పొందిన ఆపరేటర్ల ద్వారా దరఖాస్తు చేసుకున్న డెడికేటెడ్ ఉమ్రాహ్ వీసా మాత్రమే చెల్లుబాటు అవుతుంది.

**ప్రయాణ మార్పులు అనుమతించరు..**

వీసా దరఖాస్తు సమయంలో యాత్రికులందరూ వివరణాత్మక ప్రయాణ ప్రణాళికను అప్లోడ్ చేయాలి. దీన్ని సబ్మిట్ చేసిన తరువాత ఎలాంటి మార్పులు లేదా వాయిదాలకు అవకాశం ఉండదు. ప్రయాణ తేదీలను మార్చడం కుదరవు. తిరుగు ప్రయాణాన్ని వాయిదా వేస్తే ఏజెంట్లకు ఒక్కొక్కరికి కనీసం 734(రూ.18 వేలు) దిర్హమ్‌లు జరిమానా విధిస్తారు.

**వీసా ఆన్ అరైవల్**

యూకే, యూఎస్, కెనడా లేదా షెంజెన్ వీసాలు కలిగి ఉన్నవారు లేదా ఆ దేశాల్లో నివాసితులుగా ఉన్నవారు వీసా ఆన్ అరైవల్ కోసం అర్హులు. ఈ వీసా ఒక సంవత్సరం చెల్లుబాటు అవుతుంది.

**హోటల్, ట్రాన్స్‌పోర్ట్ బుకింగ్స్ కోసం తనిఖీలు**

సౌదీ విమానాశ్రయాల్లో అధికారులు నుసక్ లేదా మసార్ వ్యవస్థల ద్వారా చేసిన అన్ని బుకింగ్‌లను ధ్రువీకరిస్తారు. చెల్లని బుకింగ్‌లు తిరస్కరిస్తారు. దాంతోపాటు అక్కడికక్కడే జరిమానాలు విధించే అవకాశం ఉంటుంది.

**అధీకృత రవాణాకు మాత్రమే అనుమతి**

యాత్రికులు రవాణాను ముందస్తుగా బుక్ చేసుకోవాలి. టాక్సీలు, బస్సులు లేదా హరమైన్ రైలుతో సహా అధీకృత ఛానెళ్ల ద్వారా ముందే బుక్ చేయాలి. రిజిస్టర్ కాని సర్వీసులు అనుమతించరు.

**హరామైన్ రైలు టైమింగ్స్**

మక్కా, మదీనా మధ్య సులువైన రవాణా మార్గం అయిన హరామైన్ హైస్పీడ్ రైలు ప్రతిరోజూ రాత్రి 9 గంటల వరకు మాత్రమే నడుస్తుంది. దీని తర్వాత వచ్చే ప్రయాణికులు ముందుగానే ప్రత్యామ్నాయ రవాణాను ఏర్పాటు చేయాలి.

**భారీ జరిమానాలు**

ఈ కొత్త నిబంధనల ఉల్లంఘనకు పాల్పడితే.. అంటే ఎక్కువ కాలం ఉండటం, అనధికార రవాణాను ఉపయోగించడం లేదా తప్పుడు సమాచారంతో దరఖాస్తు చేయడం.. వంటి వాటికి కనీసం 734 దిర్హామ్‌ల నుంచి జరిమానాలు ఉంటాయి. ఏజెంట్లను కూడా సస్పెండ్ చేసే అధికారం ఉంటుంది.



# కత్తి ఇవ్వలేదని.. డైరెక్టర్‌ని ఉద్యోగం నుంచి ఊడబీకిన ట్రంప్!



**వాషింగ్టన్:** అమెరికాలోని ప్రసిద్ధ ఐజెన్‌హవర్ ప్రెసిడెన్షియల్ లైబ్రరీ డైరెక్టర్ జాన్ హెన్రీను ట్రంప్ ప్రభుత్వం హఠాత్తుగా పదవి నుంచి తొలగించింది. ఈ నిర్ణయానికి కారణం..బ్రిటన్ రాజు చార్లెస్‌కు ఓ విలువైన చారిత్రక కత్తిని బహుమతిగా ఇవ్వాలన్న ట్రంప్ ఆదేశాలను ఆయన తిరస్కరించడం. ఈ ఘటన అమెరికా రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 1945 నాటి రెండవ ప్రపంచ యుద్ధానికి చెందిన ఆ కత్తిని జాతీయ వారసత్వంగా భావించాల్సినదిగా జాన్ హెన్రీ అభిప్రాయపడ్డారు. 'ఇది ప్రజల ఆస్తి. చారిత్రకంగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన వస్తువు. దీన్ని బహుమతిగా ఇవ్వడం సరైనది కాదు'అంటూ ఆయన ట్రంప్ విజ్ఞప్తిని తిరస్కరించారు. అయితే, ట్రంప్ పరిపాలనలో ఉన్న ఉన్నతాధికారులు ఈ కత్తిని అమెరికా-బ్రిటన్ మధ్య స్నేహ బంధానికి ప్రతీకగా ఇవ్వాల్సిన బహుమతిగా పేర్కొన్నారు. కత్తి ఇవ్వండి, లేదంటే ఉద్యోగం నుంచి తొలగిస్తామని జాన్ హెన్రీకి హెచ్చరికలు జారీ చేశారు. ఉన్నతాధికారులు ఒత్తిడి చేస్తున్నప్పటికీ.. మ్యూజియంలో ఉన్న కత్తిని ట్రంప్‌కు ఇచ్చేందుకు నిరాకరించారు. దీంతో ట్రంప్ ఆదేశాల మేరకు ఆయన్ను పదవి నుంచి తొలగించారు. ఈ చర్యపై చరిత్రకారులు, మ్యూజియం నిపుణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చారిత్రక సంపదను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదు. ఇది ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే చర్యగా అభివర్ణిస్తున్నారు. ఈ వివాదంపై ఇప్పటివరకు ట్రంప్ లేదా బ్రిటన్ రాజు చార్లెస్ స్పందించలేదు.

## జపాన్ రాజకీయాల్లో
# పెనుసంచలనం!



జపాన్ రాజకీయాల్లో అత్యంత అరుదైన ఘట్టం ఈ శనివారం చోటు చేసుకోబోతోంది. కాబోయే ప్రధానిని ఎన్నుకునేందుకు అధికార లిబరల్ డెమొక్రటిక్ పార్టీ శనివారం ఓటింగ్ నిర్వహించుకోనుంది. ప్రధాని రేసులో ఐదుగురు అభ్యర్థుల పేర్లు తెరపైకి రాగా.. సనాయే టకాయిచీ (64) మరియు షింజిరో కోఇజుమి (44) ప్రధానంగా పోటీలో ముందున్నారు. 2024 అక్టోబర్, 2025 జూన్, 2025 జూలైలో పార్లమెంట్ ఉభయ సభలకు జరిగిన ఎన్నికల్లో ఎల్డీపీ వరుస పరాజయాలు చవిచూసింది. పార్టీ క్రమక్రమంగా మెజారిటీ కోల్పోవడం, ప్రజల్లో తీవ్ర అసంతృప్తి, పాత పాలనా విధానాలపై విమర్శల నేపథ్యంలో.. షిగెరూ ఇషిబా తన ప్రధాని పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసే ఉంటుంది. ఈ తరుణంలో పార్టీ కొత్త అధ్యక్షుడ్ని(ప్రధాని కూడా) ఎన్నుకోవాల్సిన అవసరం ఏర్పడింది. అయితే.. ఈ ఎన్నికతో జపాన్ చరిత్రలో అరుదైన ఘట్టం చోటు చేసుకోబోతోంది. అయితే యువ ప్రధాని, లేదంటే తొలి మహిళా ప్రధాని రాబోయే రోజుల్లో ఆ దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇతో హిరోబుమి 1885 డిసెంబర్ 22న జపాన్ తొలి ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. తాజా మాజీ ప్రధాని ఇషిబాతో కలిపి 64 మంది ఆ దేశానికి ప్రధానులుగా చేశారు. అయితే పురుషాధిక్య రాజకీయాలతో అప్పటి నుంచి ఇప్పటిదాకా ఆ దేశానికి.. మహిళా ప్రధాని అవకాశం లేకుండా పోయింది. అయితే.. యూరికో కోయికె 2016లో టోక్యో గవర్నర్‌గా ఎన్నికై.. జాతీయ స్థాయిలో నాయకత్వం కోసం మహిళలు పోటీ చేసే అవకాశానికి తలుపులు తెరిచారు. ఇప్పుడు.. సనాయే టకాయిచీ ప్రధాని రేసులో నిలిచి ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నారు.

**బలాబలాలు..**

అనుభవం వర్సెస్ యువ రక్తంగా జపాన్ ఈ ఎన్నికను భావిస్తోంది. ఎందుకంటే.. టకాయిచీకి దివంగత మాజీ ప్రధాని షింజో అబే రాజకీయ వారసురాలిగా పేరుంది. ఆయన ఆశీస్సులతోనే 2021 సెప్టెంబర్‌లో జరిగిన ఎల్డీపీ అధ్యక్ష పదవికిపోటీ చేశారామె. అయితే.. ఆ ఎన్నికల్లో పుషియో కిషిదా చేతిలో ఓడారామె. ఇక ఇప్పుడు.. ఆమె దూకుడు ఆర్థిక వ్యయం ప్రతిపాదనతో పీఎం రేసులో ప్రధానంగా నిలిచారు. పైగా ట్రంప్‌ను హ్యాండిల్ చేయడం ఈమె వల్లే సాధ్యం కావొచ్చనే టాక్ బలంగా వినిపిస్తోందక్కడ. ఇక.. జపాన్ రాజకీయాల్లో పాత తరపు నాయకత్వ శైలికి ప్రత్యామ్నాయం కావాలనే డిమాండ్ చాలాకాలంగా వినిపిస్తోంది. దానికి తగ్గట్లే కోయిజుమి మితవాద పన్ను తగ్గింపు విధానాన్ని ముందుంచారు. ఇది జపాన్ ఆర్థిక దిశను మలుపు తిప్పే అంశం కావడంతో ఆసక్తి నెలకొంది. ముందస్తు పోల్స్, అంచనాల ప్రకారం.. పోటీ తీవ్రంగానే ఉన్నా కోయిజుమీనే ఆధిక్యంతో ఉన్నట్లు తెలుస్తోంది. శనివారం జరగబోయే ఎన్నికల్లో.. తొలి రౌండ్‌లో గనుక ఫలితం లేకపోతే మరో రౌండ్‌కు వెళ్తారు.

**తీవ్ర సంక్షోభం మధ్య..**

జపాన్‌లో గత కొన్ని దశాబ్దాలుగా 1995 సిస్టమ్ అధికారం కొనసాగుతోంది. 1955లో స్థాపించబడిన ఎల్‌డీపీ(LDP) ఇప్పటికీ జపాన్ రాజకీయాలను శాసిస్తోంది. ఈ 70 ఏళ్ల కాలంలో.. 1993-1996(కూటమి ప్రభుత్వం), 2009-2012(డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ జపాన్ DPJ) మధ్య కాలాలను మినహాయిస్తే మిగతా ఏళ్లు ఎల్డీపీనే అధికారంలో కొనసాగింది. అయితే అనారోగ్య కారణాలతో షింజో అబే ప్రధాని పదవి నుంచి దిగిపోయాక.. ఆ పార్టీ పట్టు కోల్పోతూ వస్తోంది. ఈ తరుణంలో కొత్త నాయకత్వం ద్వారా పార్టీని పునరుద్ధరించుకోవాలని భావిస్తోంది.



# గ్రీస్‌లో స్తంభించిన జనజీవనం..
## పని గంటల పెంపుపై నిరసనలు

**ఏథెన్స్:** కార్మిక సంఘాల సమ్మెతో గ్రీస్ దేశంలో జన జీవనం స్తంభించిపోయింది. కార్మిక చట్టాల్లో మార్పులు చేసేందుకు గ్రీస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేయడంతో ఉద్యోగ సంఘాలకు సమ్మెకు పిలుపునిచ్చాయి. పని గంటలను 13కు పెంచడంపై తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. దీంతో, దేశవ్యాప్తంగా వేలాది మంది నిరసన కారులు వీధుల్లోకి వచ్చారు. ఈ క్రమంలో రవాణా వ్యవస్థ నిలిచిపోయింది. సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వివరాల ప్రకారం.. గ్రీస్‌లో ఒక షిఫ్టులో పని గంటలను 13కు పెంచడంపై తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. గ్రీస్ ప్రభుత్వం ప్రతిపాదించిన కార్మిక చట్ట సవరణల్లో షిఫ్ట్ పని గంటలను 13కు పెంచడం వంటి ఉన్నాయి. ఈ అదనపు పనిగంటలు వారానికి గరిష్ఠంగా 48 గంటలకు పరిమితి చేయగా, ఏడాదికి 150 గంటలకు మించకూడదని పేర్కొంది. వీటిని కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. తమ హక్కులను అణచివేయడమే కాకుండా పనిజీవన సమతుల్యతను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహిస్తున్నాయి. ఇందులో భాగంగా కార్మిక సంఘాలు 24 గంటల సమ్మెకు పిలుపునివ్వడంతో దేశవ్యాప్తంగా జనజీవనం స్తంభించింది. ప్రభుత్వ, ప్రైవేటు కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్తంగా వేలాది మంది నిరసన కారులు వీధుల్లోకి వచ్చారు. దీంతో ఏథెన్స్‌లో టాక్సీ, రైలు సర్వీసులు నిలిచిపోయాయి. ఆయా నగరాల్లో బస్సులు, ట్రామ్, ట్రాలీ సర్వీసులు మాత్రం పరిమిత స్థాయిలో సేవలందించాయి. పాఠశాలలు, కోర్టులు, ఆసుపత్రులు సహా ప్రభుత్వ సేవలకు అంతరాయం ఏర్పడింది. ఎక్కడికక్కడ రవాణా వ్యవస్థ నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉద్యోగ సంఘాల సమ్మెకు చెందిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## భారత్ అలాంటి దేశమేం కాదు..
# అది అమెరికాకే ప్రమాదం



భారత్‌తో రష్యా సంబంధాలపై ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. వాణిజ్యం విషయంలో ట్రంప్ ప్రభుత్వ ఒత్తిళ్లపై భారత్ ఏనాటికీ తలవంచబోదని అన్నారు. ఈ క్రమంలో అమెరికాపై తీవ్ర విమర్శలు గుప్పిస్తూనే.. భారతదేశం ఎప్పటికీ అవమానాన్ని అంగీకరించబోదని అన్నారాయన. అక్టోబర్ 2న దక్షిణ రష్యాలోని సోచీలో జరిగిన అంతర్జాతీయ వాల్దాయ్ చర్చా వేదికలో ఆయన ప్రసంగించారు. భారత్ సహా 140 దేశాల ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు తగ్గించమని భారత్‌పై అమెరికా ఒత్తిళ్లు చేయడం పట్ల పుతిన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు అమెరికా ఆర్థిక వ్యవస్థకే నష్టాన్ని కలిగిస్తాయని అన్నారాయన. భారతదేశం ఎప్పటికీ అవమానాన్ని అంగీకరించదు. ఒకవేళ రష్యా చమురు కొనుగోలు ఆపితే 9 నుంచి 10 బిలియన్ డాలర్ల వరకు ఆ దేశానికి నష్టాలు తప్పవు. మోదీ నా స్నేహితుడు. ఆయన గురించి నాకు బాగా తెలుసు. కాబట్టి ఆయన అలాంటి నిర్ణయాలు తీసుకునే వ్యక్తి కాదు. భారత ప్రజలు తమ నాయకత్వ నిర్ణయాలను గమనిస్తారు. వారు ఎప్పటికీ ఇతరుల ముందు అవమానాన్ని సహించరు అని అన్నారు. ఇలాంటి ఒత్తిడులు అమెరికా ఆర్థిక వ్యవస్థకే నష్టాన్ని కలిగిస్తాయని ట్రంప్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ''ఇలాంటి నిర్ణయాలతో ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు పెంచాల్సి వస్తుంది. దీని వల్ల అమెరికా ఆర్థిక వృద్ధే మందగిస్తుంది'' అని పుతిన్ హెచ్చరించారు. ప్రధాని మోదీతో నాకున్న సంబంధం ఆత్మీయత, నమ్మకంతో నిండినది. భారత్‌తో వ్యాపార అసమతుల్యత తగ్గించేందుకు చర్యలు తీసుకుంటాం. భారతదేశం నుంచి వ్యవసాయ ఉత్పత్తులు, ఔషధాలు ఎక్కువగా కొనుగోలు చేయాలని రష్యా యోచిస్తోంది. ఇందుకోసం డిసెంబర్‌లో భారత్‌లో పర్యటించబోతున్నా అని ప్రకటించారాయన. అమెరికా న్యూక్లియర్ విద్యుత్ ఉత్పత్తిలో రష్యా యురేనియంపై ఆధారపడుతోంది. మేము అమెరికా మార్కెట్‌కు రెండవ అతిపెద్ద యురేనియం సరఫరాదారులం'' అని పుతిన్ గుర్తుచేశారు.

# హీరోయిన్ త్రిష ఇంటికి బాంబు బెదిరింపు



తమిళనాడులో ప్రముఖులకు బాంబు బెదిరింపులు కలకలం రేపుతున్నాయి. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, బీజేపీ రాష్ట్ర కార్యాలయం, స్టార్ హీరోయిన్ త్రిషా కృష్ణన్ నివాసంతో పాటు పలు కీలక ప్రాంతాలకు బాంబు బెదిరింపు కాల్స్ రావడంతో భద్రతా వ్యవస్థ పూర్తిగా హైఅలర్ట్ మోడ్‌లోకి వెళ్లింది. గురువారం (అక్టోబర్ 2) సాయంత్రం నుంచి ఈ బెదిరింపు కాల్స్ వరుసగా రావడం ప్రారంభమయ్యాయి. సీఎం స్టాలిన్ నివాసం, చెన్నై రాజ్‌భవన్, బీజేపీ పార్టీ కార్యాలయం, మరియు సినీ నటి త్రిషా ఇంటికి ఫోన్ కాల్స్ ద్వారా బాంబులు పెట్టామంటూ బెదిరింపులు రావడంతో పోలీసు శాఖ అప్రమత్తమైంది.. బాంబు బెదిరింపుల నేపథ్యంలో చెన్నై పోలీసు శాఖ తక్షణమే స్పందించింది. బాంబ్ డిటెక్షన్ అండ్ డిస్పోజల్ స్క్వాడ్ (BDDS), డాగ్ స్క్వాడ్‌తో పాటు పలు ప్రత్యేక బలగాలను రంగంలోకి దించి తనిఖీలు చేపట్టారు. ప్రస్తుతానికి ఎలాంటి పేలుడు పదార్థాలు లేదా అనుమానాస్పద వస్తువులు లభ్యంకాలేదని పోలీసులు వెల్లడించారు. స్టార్ హీరోయిన్ త్రిషా చెన్నై నగరంలోని సెనోటాఫ్ రోడ్ వద్ద నివసిస్తున్నారు. ఇది సీఎం స్టాలిన్ నివసించే చిత్తరంజన్ రోడ్ కు సమీప ప్రాంతం కావడంతో భద్రతా విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ కాల్స్ వెనుక ఎవరు ఉన్నారనే దానిపై సైబర్ క్రైమ్ విభాగం విచారణ ప్రారంభించింది. కాల్స్ చేసిన వ్యక్తుల కాల్ లొకేషన్, టెక్నికల్ ఆధారాలు సేకరించి విచారణ జరుగుతోంది. ఇది కేవలం ఆకతాయిల ప్రయత్నమా? లేక రాజకీయ లేదా వ్యక్తిగత కుట్రల భాగమా? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. గతంలో కూడా, జూలై 27న సీఎం స్టాలిన్ ఇంటికి వచ్చిన బెదిరింపు కాల్‌ను ఆకతాయిల పనిగా పోలీసులు నిర్ధారించిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు తిరిగి పలువురు ప్రముఖుల్ని టార్గెట్ చేయడం, క్రమం తప్పకుండా బెదిరింపులు రావడం పోలీసు శాఖను మరింత అప్రమత్తం చేస్తోంది. తాజా పరిణామాల నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం ఈ బెదిరింపులను సీరియస్‌గా తీసుకుంది. నిందితులను త్వరగా పట్టుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. అలాగే, ముఖ్యమైన వ్యక్తుల నివాస ప్రాంతాల్లో భద్రతా చర్యలను బలోపేతం చేసింది.



# పోలీసులకు ఐబొమ్మ వార్నింగ్..

## స్పందించిన తెలంగాణ ప్రభుత్వం




సినిమా పైరసీ రాకెట్‌ను ఛేదించిన హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులపై చాలామంది ప్రశంసలు కురిపించారు. ఈ ముఠాకు చెందిన ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద డెబిట్‌కార్డులు, హార్డ్‌డిస్క్‌లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ వార్తలు వచ్చిన కొన్ని గంటల్లోనే సినిమా పైరసీ వెబ్‌సైట్ ఐబొమ్మ పేరుతో తెలంగాణ పోలీసులకు హెచ్చరికలు అంటూ ఒక పోస్ట్ వైరల్ అయింది. తాజాగా వాటిని తెలంగాణ ప్రభుత్వం ఖండించింది. ఈ అంశంపై వచ్చిన బెదిరింపుల వార్తలు అవాస్తం అంటూ తెలంగాణ ప్రభుత్వ ఫ్యాక్ట్‌చెక్ టీమ్ చెప్పింది. ఐ బొమ్మ గురించి తెలంగాణ ప్రభుత్వ ఫ్యాక్ట్‌చెక్ పేజీ తమ 'ఎక్స్'లో ఓ పోస్టు పెట్టింది. 'కొన్ని మీడియా కథనాలు, సోషల్ మీడియా పోస్టుల ప్రకారం, సినిమా పైరసీ సైట్ ఐబొమ్మ తెలంగాణ పోలీసులకు హెచ్చరిక జారీ చేసి, గోప్యమైన ఫోన్ నంబర్లను లీక్ చేస్తామని బెదిరించిందని చెబుతున్నారు. అయితే, ప్రసారం అవుతున్న స్క్రీన్‌షాట్‌లు 2023 నాటివి. అవి కూడా పోలీసులకు కాకుండా తెలుగు సినిమా పరిశ్రమకు సంబంధించినవే. దీనిని స్పష్టం చేస్తూ, తెలంగాణ పోలీసులకు ఇలాంటి ఎటువంటి బెదిరింపు రాలేదని తెలియజేస్తున్నాం. ప్రజలు సోషల్ మీడియాలో పోస్టు చేసే, షేర్ చేసే విషయాల్లో జాగ్రత్త వహించాల్సిందిగా మనవి.' అని తెలిపింది.

# కొత్త ఇంటికి సమంత..

దసరా పండగ సందర్భంగా తన అభిమానులకు ఓ స్పెషల్ అప్డేట్‌ను ఇచ్చింది సౌత్ స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు. ''కొత్త ప్రయాణం'' అంటూ సోషల్ మీడియాలో ఓ ఫోటోను షేర్ చేసిన ఆమె, మళ్లీ ఒక్కసారిగా ఫ్యాన్స్‌లో, నెటిజన్లలో ఆసక్తిని రేకెత్తించారు. ఇటీవల ఆమె రెండో పెళ్లి వార్తలు మీడియాలో హల్‌చల్ చేస్తున్న నేపథ్యంలో, ''కొత్త ప్రయాణం'' అనే మాట మరింత చర్చనీయాంశంగా మారింది. అయితే సమంత పోస్ట్ చేసిన ''కొత్త ప్రయాణం'' అనే విషయం పెళ్లికి సంబంధించినది కాదు. కొత్త ఇంటికి షిఫ్ట్ అయిన క్రమంలో ఈ కామెంట్ చేసింది. ఇక కొత్త ఇంటి ఫోటోను ఆమె స్వయంగా షేర్ చేసింది. ఇంటి గోడపై ''SAM'' అనే లోగోను స్టైలిష్‌గా ఏర్పాటు చేయగా, అదే ఫోటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే ఇది హైదరాబాద్‌లోని ? లేక ముంబయిలోనా? అన్నది ఇంకా స్పష్టంగా తెలియాల్సి ఉంది. ఇదిలా ఉండగా, బాలీవుడ్ దర్శకుడు రాజ్ నిడిమోరు, సమంత మధ్య గత కొంతకాలంగా సన్నిహిత సంబంధం ఉందని ప్రచారం సాగుతోంది. వీరిద్దరూ 'ది ఫ్యామిలీ మ్యాన్ 2', 'సిటాడెల్' సిరీస్‌ల్లో కలిసి పని చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి వీరిద్దరూ కలిసి పలు ఈవెంట్లకు హాజరై మీడియా కంట పడుతున్నారు. దీంతో సమంత త్వరలో రెండో వివాహం చేసుకోనుందన్న వార్తలు వస్తూనే ఉన్నాయి. తాజాగా ఆమె కొత్త ఇంటికి షిఫ్ట్ కావడం ఈ వార్తలకు మరింత బలం చేకూర్చినట్లైంది. అయితే దీనిపై సమంత నుంచి ఇంకా ఎలాంటి అధికారిక స్పందన రాలేదు. ఇక సినిమాల పరంగా చూస్తే, సమంత ప్రస్తుతం రెండు ప్రాజెక్టులపై పని చేస్తోంది. ఒక్కటి పాన్‌ఇండియా స్థాయిలో రూపొందుతున్న ''రక్త్‌బ్రహ్మాండ: ది బ్లడీ కింగ్‌డమ్'', మరొకటి కుటుంబ కథా చిత్రంగా తెరకెక్కుతున్న ''మా ఇంటి బంగారం''. ప్రస్తుతం ఈ రెండు సినిమాలు షూటింగ్ దశలో ఉన్నాయి. అభిమానులు చాలా కాలంగా సమంతను పెద్ద తెరపై మళ్లీ చూడాలనుకుంటుండగా, ఈ సినిమాల విడుదల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ''కొత్త ఇంటి లోగోతో, కొత్త జీవితం వైపు అడుగులు వేస్తున్న సామ్.. త్వరలో మరిన్ని వివరాలు వెల్లడించనున్నారా?'' అనే ఉత్కంఠతో ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు.



# నా కూతుర్ని న్యూడ్ ఫోటోలు పంపమన్నారు: అక్షయ్ కుమార్



**ముంబై:** తన టీనేజ్ కూతురు మొబైల్‌లో ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్న సమయంలో .. నగ్న ఫోటో పంపాలంటూ ఓ సైబర్ క్రిమినల్ మెసేజ్ చేశాడని బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్ తెలిపారు. కానీ తన కూతురు చాలా సమయస్ఫూర్తితో స్పందించి తన మొబైల్‌ను స్విచాఫ్ చేసిందన్నారు. ముంబైలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన సైబర్ అవగాహన కార్యక్రమంలో అక్షయ్ కుమార్ మాట్లాడుతూ ఈ ఉదంతాన్ని గుర్తు చేశారు. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో పాటు సీనియర్ పోలీసు ఆఫీసర్లు కూడా ఆ వేదికపైనే ఉన్నారు. కొన్ని నెలల క్రితం ఈ ఘటన జరిగిందని, తన కుమార్తె ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్న సమయంలో ఓ అపరిచిత వ్యక్తి ఆమెకు తారసపడ్డాడని, అతను తొలుత స్నేహపూర్వకంగా మెసేజ్‌లు చేశాడని, తర్వాత ఆ వ్యక్తే అకస్మాత్తుగా నగ్న ఫోటోలు పంపాలంటూ మెసేజ్ చేసినట్లు అక్షయ్ పేర్కొన్నారు. కానీ ఆ సమయంలో తన కుమార్తె చాలా తెలివిగా ప్రవర్తించి, చాకచక్యంగా తన ఫోన్‌ను స్విచాఫ్ చేసిందని, ఆ తర్వాత తల్లి వద్దకు వెళ్లి జరిగిన విషయాన్ని చెప్పిందని అక్షయ్ గుర్తు చేశారు. తన కూతురు అలర్ట్‌గా ఉండడం వల్ల.. సైబర్ క్రిమినల్స్ బారినపడలేదన్నారు. రాష్ట్రంలోని 8వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు స్కూళ్లలో సైబర్ అవగాహనపై పాఠాలు బోధించేలా చూడాలని సీఎం ఫడ్నవీస్‌ను అక్షయ్ కోరారు. ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్న సమయంలో నువ్వెక్కడ ఉన్నావని అవతలి వ్యక్తి తొలుత ప్రశ్నించాడని, దానికి ముంబై నుంచి అని తన కూతురు సమాధానం ఇచ్చిందన్నారు. అయితే గేమ్ కొనసాగుతున్న సమయంలో.. ఆ వ్యక్తి అనేక సందేశాలు పంపాడన్నారు. ఆ తర్వాత కాసేపటికి అబ్బాయివా లేక అమ్మాయివా అని అడిగాడని, ఆ ప్రశ్నకు అమ్మాయి అని తన కూతురు సమాధానం ఇచ్చినట్లు అక్షయ్ తెలిపారు. ఇలాంటి సంఘటనలు ఇలాగే జరుగుతుంటాయని, కానీ తన కూతురు తన భార్యతో మాట్లాడి మంచి పనిచేసిందన్నారు. సైబర్ నేరాల్లో ఇది ముఖ్యమైందని, పిల్లలకు ఎరవేస్తుంటారని, కొన్ని కేసుల్లో బెదిరింపులకు పాల్పడుతారని, ఇలాంటివి చాలా జరుగుతుంటాయని, అనేక సందర్భాల్లో బాధితులు బలవన్మరణానికి పాల్పడే అవకాశాలు ఉన్నట్లు అక్షయ్ కుమార్ తెలిపారు. స్కూళ్లలో చరిత్ర, గణితం పాఠ్యాంశాలు బోధిస్తారని, రెండు రెండ్ల నాలుగు అవుతుందని, కానీ సైబర్ ప్రపంచంలో అది జీరో అవుతుందన్న విషయాన్ని స్కూల్ పిల్లలకు నేర్పాలన్నారు. సైబర్ సేఫ్టీ గురించి మహారాష్ట్ర స్కూళ్లలో ఏడు నుంచి 10 తరగతి పిల్లలకు పాఠాలు బోధించాలని సీఎంను కోరారు. వీధుల్లో జరిగే నేరం కన్నా.. సైబర్ క్రైం చాలా పెద్దదని అక్షయ్ అన్నారు.

# స్టార్ క్రికెటర్ సోదరి..

## బిగ్‌బాస్‌లోకి వైల్డ్ కార్డ్ ఎంట్రీ

బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ హోస్ట్‌గా 'బిగ్‌బాస్ 19' ఆగష్టులో మొదలైంది. హిందీలో కొనసాగుతున్న ఈ షో ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ దక్కించుకుంది. అయితే, ఈ షోలోకి భారత క్రికెటర్ అక్క వైల్డ్ కార్డ్ ఎంట్రీ ఇస్తున్నట్లు బాలీవుడ్‌లో వైరల్ అవుతుంది. ఈమేరకు సోషల్‌మీడియాలో పలు పోస్ట్‌లు కనిపిస్తున్నాయి. ఇండియన్ క్రికెటర్ దీపక్ చాహర్ సోదరి మాల్తీ చాహర్ హిందీ బిగ్‌బాస్ 19లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. ఆమె మోడల్‌గా తన కెరీర్‌ను ప్రారంభించి బాలీవుడ్ పలు సినిమాల్లో కూడా నటించింది. సోషల్‌మీడియాలో ఆమె కంటెంట్ క్రియేటర్‌గా కూడా రాణిస్తుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో మాల్తీకి సుమారు పది లక్షలకు పైగా ఫాలోవర్స్ ఉన్నారు. ఆమె 2014లో ఫెమినా మిస్ ఫోటోజెనిక్, మిస్ సుడోకు కిరీటాలను గెలుచుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాకు చెందిన ఈ బ్యూటీ 2018లో అనిల్ శర్మ దర్శకత్వం వహించిన బాలీవుడ్ చిత్రం జీనియస్ ద్వారా రూబీనా పాత్రను పోషించింది. అరవింద్ పాండే దర్శకత్వం వహించిన రొమాంటిక్ డ్రామా ఇష్క్ పాష్మినా (2022)లో ఒమిషా పాత్రను పోషించి తన నటనా నైపుణ్యాలను మరింతగా ప్రదర్శించింది. అనేక బ్రాండ్లకు ప్రచారకర్తగా కూడా ఆమె పనిచేస్తోంది. ఇన్‌స్టాలో గ్లామరస్ ఫొటోలు, ఫ్యాషన్ పోస్ట్‌లతో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటుంది. 2018లో ఐపీఎల్ మ్యాచ్‌లో మిస్టరీ గర్ల్‌గా ఫేమస్ అయ్యింది. ఆ తరువాత ఆమె దీపక్ చాహర్ సోదరి అని ప్రపంచానికి తెలిసింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com